విశాఖపట్టణం
ఆదివారం 20 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 219 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# సుప్రీంకు దానం



అనర్హత వేటుపై పిటీషన్

స్పీకర్ నిర్ణయాన్ని కాదని తీర్పుపై అప్పీలు

తెలంగాణ రాజకీయాల్లో కలకలం

2

# పేదలకు పట్టాభిషేకం

28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలతో లబ్ది

రూ.8,874 కోట్ల విలువైన భూమిపై పేదలకు హక్కులు

399 ఎకరాలు క్రమబద్ధీకరించి పట్టాలు పంపిణీ చేసిన సీఎం

గత పాలనలో భయం... నేడు కూటమి హయాంలో భరోసా

విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు





(విశాఖపట్నం- జయజయహే)

దశాబ్దాలుగా ఇళ్లపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లాలోని 28,445 కుటుంబాలకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టాలు పంపిణీ చేశారు. విశాఖలోని 11 మండలాల్లో 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించడంతో పాటు మొత్తం 19,33,853 చదరపు గజాల స్థలాన్ని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమంలో కొందరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి స్వయంగా పట్టాలు అందజేశారు. రూ.8,874 కోట్ల విలువైన భూమిపై పేదలకు హక్కు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టాలను పంపిణీ చేశారు. పట్టాలు అందుకున్న కుటుంబాల్లో సంతోషం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "పేదలకు పట్టాభిషేకం చేస్తున్నాం. వారి ఇళ్లపై సర్వహక్కులు కల్పిస్తున్నాం. ఇన్నాళ్లూ మీ ఇళ్లపై మీకు హక్కు లేదనే బాధ ఉండేది. దశాబ్దాల ఆందోళనకు ఇవాళ ముగింపు పలుకుతున్నాం. ఇక మీ ఇళ్లపై వివాదం లేదు.. భయం లేదు.. హక్కు మాత్రమే ఉంటుంది. కన్వేయన్స్ డీడ్స్ ఇస్తున్నామని, రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఈ భూముల విలువ రూ.8,874 కోట్లు ఉంటుంది. మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉంటుంది. భూమి విలువ పెరిగిందని అమ్ముకోవద్దు. ఈ భూమే మీకు భరోసా... ..మిగతా 2లో



# 513 కరవు మండలాలు..!

అధికారులు ప్రాథమిక అంచనా

అక్టోబర్ 1న ప్రభుత్వం ప్రకటన.. సీఎం చంద్రబాబుకి నివేదన

సూక్ష్మసేద్యం, ప్రకృతి సాగును ప్రొత్సహించాలి

తాగునీటి ఎద్దడి జరగకుండా కార్యచరణ

అధికారులకు చంద్రబాబు ఆదేశాలు

(అమరావతి - జయజయహే)

513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి హై అలర్ట్ ప్రకటించారు. రైతు పంటకు భరోసా, ప్రజలకు నీటి భద్రతే లక్ష్యంగా సీఎం ముందస్తు యాక్షన్ ప్లాన్‌కు దిశానిర్దేశం చేశారు. వర్షాభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి అక్టోబర్ 1న కరవు మండలాలను ప్రకటించాలని ఆదేశించారు. పంట నష్టం రాకుండా ఇప్పటి నుంచే చర్యలు మొదలు పెట్టాలని, సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని తాగునీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ సిద్ధం ..మిగతా 2లో

# ప్రజల దాహం తీర్చలేని ప్రభుత్వం ఎందుకు?

నీటి సమస్యను పక్కనపెట్టి ప్రతిపక్షంపై రాజకీయ విమర్శలా..?

స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై ప్రభుత్వం తక్షణం స్పష్టత ఇవ్వాలి

విశాఖ భూములను బినామీ కంపెనీలకు కట్టబెడుతున్నారు

అమరావతి రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం చంద్రబాబు కుట్ర

మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ మండిపాటు

(విశాఖపట్నం - జయజయహే)

విశాఖపట్నం ప్రజలు తీవ్ర నీటి కొరతతో అల్లాడుతున్న పరిస్థితుల్లో ఉంటే నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ సమస్యపై స్పందించకుండా రాజకీయ విమర్శలకే వేదికను ఉపయోగించుకున్నారని వైఎస్సార్సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆక్షేపించారు. విశాఖలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్, గృహ నిర్మాణానికి చేపట్టిన కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటోందని వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు, ఉద్యోగుల తొలగింపులు, ప్లాంట్ భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. నగరంలో మూడు, నాలుగు ..మిగతా 3లో



# సంస్థాగతంగా బలంగా లేం!

గెలిచే సీట్లలోనే పోటీ చేద్దాం

వంద శాతం స్ట్రైక్ రేటు సాధిద్దాం

నేతలెవరూ తొందపడి నోరు జారొద్దు

మీ గౌరవాన్ని కాపాడే బాధ్యత మాది

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్



(విశాఖపట్నం - జయజయహే)

జనసేన రాజకీయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జనసేన పార్టీ సంస్థాగతంగా కొంత బలహీనంగా ఉండవచ్చని, అయితే అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలను కార్యకర్తలంతా క్రమశిక్షణతో పాటిస్తే పార్టీ తిరుగులేని శక్తిగా ..మిగతా 2లో




# నో యూపీఐ.. ఓన్లీ క్యాష్..!

రూ. 2వేలు పైబడి కొనుగోలుపై ఆంక్షలు

పెట్రో డీలర్ల నియమాలు

దేశమంతటా అమలు చేసేలా చర్యలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

యూపీఐ ఛార్జిల ప్రకటన ప్రభావం దేశంలో అక్కడక్కడా మార్పు మొదలైనట్టు కనిపిస్తోంది. తాజాగా మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పెట్రోల్ పంప్ డీలర్లు వాహనదారులకు ఒక హెచ్చరిక జారీ చేసినట్టు సమాచారం. రూ.2000 కంటే ఎక్కువ ఇంధనాన్ని కొనుగోలు చేస్తే చెల్లింపు నగదులోనే ఉండాలని, ఇలాంటి సందర్భాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ యూపీఐ చెల్లింపులు అంగీకరించబోమని వారు తేల్చి చెబుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవలే యూపీఐ చెల్లింపులపై కేంద్రం ఛార్జీలు, జీఎస్టీ విధింపు ప్రకటన విడుదల ..మిగతా 2లో

## నేడు విశాఖ వేదికగా

# సంస్కృతి గజల్స్ సందడి!




3

తొలి సారి సోలో ప్రదర్శన

వందలాది ప్రదర్శనలతో తండ్రి గజల్ శ్రీనివాస్‌తో తనయ పోటీ

# తీవ్ర వాయు గండం!

బలపడుతున్న అల్పపీడనం

రాష్ట్రానికి భారీ వర్ష సూచన.. వాతావరణ శాఖ హెచ్చరిక



(అమరావతి - జయజయహే)

రాష్ట్రానికి వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో మళ్లీ ఉపరితల ఆవర్తనం తీవ్రరూపం దాల్చుతోంది. ఉత్తర అండమాన్ పరిసర ప్రాంతాలలో శనివారం సాయంత్రానికి ఒక అల్పపీడనం ఏర్పడనుందని.... ఇది సోమవారానికి వాయుగుండంగా బలపడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ అల్పపీడన వ్యవస్థ ..మిగతా 2లో





# పేదలకు పట్టాభిషేకం

మొదటి పేజీ తరువాయి...

ధైర్యం. 2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వేలాది కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆస్తి హక్కును కల్పించింది. ప్రజలు ఇచ్చిన అధికారంతో రాష్ట్ర పునర్నిర్మాణానికి ఒక్కో ఇటుకా పేరుస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు.. భయం నుంచి భరోసా వైపు.. నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం ఇది పట్టాల పంపిణీ మాత్రమే కాదు.. పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం. హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.




**పంచగ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం**

"కూడు, గూడు, గుడ్డ.. ఇదే మా ప్రభుత్వ నినాదం. ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నాం. ఇంటి జాగా ఇస్తాం.. ఇల్లు కట్టిస్తాం.. ప్రతి కుటుంబానికి శాశ్వత చిరునామా కల్పిస్తాం. రెండేళ్లలో 5 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. వచ్చే మార్చిలోగా మరో 5 లక్షలకు పైగా ఇళ్లు అందిస్తాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కూటమి ప్రభుత్వ విధానం. విశాఖలోని పంచగ్రామాల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తాం. ఇంకా 22 వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంది.. వారందరికీ త్వరలో పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటాం. మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తున్నాం. వివిధ జిల్లాల్లో ఇప్పటికే 12 వేల కుటుంబాలకు భూములను క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చాం.




**కాబోయే విశ్వనగరం విశాఖ**

విశాఖ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటని ముఖ్యమంత్రి అన్నారు. అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగామని చెప్పారు. విశాఖ కాబోయే విశ్వనగరమని, అభివృద్ధి ఫలాల్లో పేదలకూ భాగస్వామ్యం ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. విశాఖను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 145 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగించామని తెలిపారు. తిరుమలలో 89.4 శాతం పచ్చదనం ఉన్నట్లే విశాఖలోనూ పచ్చదనాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. విశాఖ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడేందుకు కేంద్రం సహకరించిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. విశాఖ అభివృద్ధి ఇక ఆగదని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో విశాఖలో భూ వివాదాలు, కూల్చివేతలు, ఇతర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ముఖ్యమంత్రి విమర్శించారు. గత పాలకులు భూ కబ్జాలకు పాల్పడితే.. నేడు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తోందన్నారు. రుషికొండలో నిర్మించిన భవనాల నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుని ప్రజలకు ప్రయోజనం కలిగేలా చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను తీసుకొస్తుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని, డేటా సెంటర్ల విషయంలోనూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. విశాఖ ప్రజలకు తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీరు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, అచ్చెన్నాయుడు, బాలవీరాంజనేయ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## 27న 22(ఏ) భూముల సమస్యలపై విశాఖలో సమరశంఖం

**న్యాయబద్ధమైన భూమి హక్కుల సాధనకు సమగ్ర చర్చ**

**మాజీ ఐపీఎస్ అధికారి ఏ.బీ. వెంకటేశ్వరరావు, నల్లమోతు చక్రవర్తి నేతృత్వంలో సమావేశం**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19, జయ జయహే :**

విశాఖలో 22(ఏ) భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు, భూయజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఈ నెల 27న ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలుగు శక్తి అధినేత బి.వి. రామ్ తెలిపారు. న్యాయబద్ధమైన భూమి హక్కుల సాధనతో పాటు, బాధితుల సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడమే లక్ష్యంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.రైల్వే న్యూ కాలనీలోని సుబ్బలక్ష్మి కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం



జరగనుంది. మాజీ ఐపీఎస్ అధికారి ఏ.బీ. వెంకటేశ్వరరావు, సెంటర్ ఫర్ లిబర్టీ అధ్యక్షుడు నల్లమోతు చక్రవర్తి నేతృత్వంలో ఈ చర్చ కొనసాగనుంది.22(ఏ) పరిధిలో భూములు ఉ ండటంతో రైతులు, భూయజమానులు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్, క్రయవిక్రయాలు, భూ హక్కులు, ఇతర పరిపాలనా సమస్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తమ భూముల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను బాధితులు నేరుగా వివరించే అవకాశం కల్పించడంతో పాటు, వాటికి చట్టపరంగా, న్యాయబద్ధంగా పరిష్కారం కనుగొనే మార్గాలపై నిపుణులతో చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.భూములపై హక్కులు కలిగిన వారు తమ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన తదుపరి కార్యాచరణపై స్పష్టత పొందేందుకు ఈ సమావేశం వేదికగా నిలవనుందని బి.వి. రామ్ పేర్కొన్నారు. భూమి హక్కులకు సంబంధించిన సమస్యలను సమగ్రంగా చర్చించి, బాధితులకు న్యాయం జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. 22(ఏ) భూముల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, భూయజమానులు ఈ సమావేశానికి హాజరై తమ సమస్యలను వివరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## 513 కరవు మండలాలు..!

మొదటి పేజీ తరువాయి...

చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు అమరావతిలోని ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు రాష్ట్రంలో నెలకొన్న కరవు ముప్పుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీ వ్యాప్తంగా కరవు ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులు, ప్రజలకు ఇబ్బందులు రాకుండా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరులు, వ్యవసాయ రంగంపై సమగ్ర కార్యాచరణ కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు. నీటి లభ్యత తగ్గుతున్న పరిస్థితుల్లో రైతులకు అందుబాటులో ఉన్న సాంకేతిక సేవలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేలా మైక్రో ఇరిగేషన్‌ను విస్తృతంగా అమలు చేయాలని ఆదేశించారు. అన్నదాతలను సూక్ష్మ సేద్యానికి మరింతగా అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏపీఎంఐపీ కింద కర్షకులకు సంబంధించిన నాలుగు కీలక సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి : సాంకేతిక సేవలు రైతులకు సులభంగా చేరేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. పంటలకు నీటి అవసరం, అందుబాటులో ఉన్న వనరులను బట్టి రైతులకు తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రకృతి సేద్యం వైపు అన్నదాతలను మళ్లించే కార్యాచరణను కూడా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. హై రిస్క్ ప్రాంతాల్లో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. విశాఖ తాగునీటి సరఫరాపై చంద్రబాబు ప్రత్యేకంగా అధికారులతో చర్చించారు. నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. బోర్లపై ఆధారపడే ప్రాంతాల్లో అవసరమైతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లను నింపేందుకు యుద్ధప్రాతిపదికన చేపట్టగల పనులపై అవకాశాలను పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.

## సంస్థాగతంగా బలంగా లేం!

మొదటి పేజీ తరువాయి...

ఎదుగుతుందన్నారు. విశాఖపట్నంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ సీట్లలో పోటీ చేయాలని ఆశ పడవద్దని, కచ్చితంగా గెలిచే సీట్లలోనే పోటీ చేద్దాం.. వంద శాతం స్ట్రైక్ రేట్ సాధిద్దామని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. తొందర పడి మనకు ఒత్తిడి వచ్చిందని, 100 ఇవ్వండి, 120 సీట్లు ఇవ్వండని మాత్రం అడగటం లాంటివి చేయవద్దన్నారు. మీ గౌరవాన్ని కాపాడే బాధ్యత ఎల్లప్పుడూ తాను తీసుకుంటానని పవన్ కళ్యాణ్ చెప్పారని మంత్రి నాదెండ్ల గుర్తుచేశారు. జనసేన పార్టీ బలోపేతం, కూటమి ధర్మంపై మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన సంస్థాగతంగా బలంగా లేకపోవచ్చు, కానీ నాయకుడు పవన్ కళ్యాణ్ చెప్పినట్లు కార్యకర్తలు వింటే మన పార్టీ బలంగా తయారవుతుందన్నారు. పార్టీ నాయకత్వం సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. అలాగే కూటమిలో కొనసాగుతున్న క్రమంలో ఎదురయ్యే పరిస్థితులపై కూడా ఆయన స్పందించారు. రాజకీయాల్లో కూటమిగా ముందుకు సాగుతున్నప్పుడు స్థానికంగా చిన్న చిన్న విభేదాలు, అభిప్రాయభేదాలు తలెత్తడం సహజమని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో నాయకులు సహనం కోల్పోయినా, క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలు మాత్రం సంయమనం పాటించాలని సూచించారు. ట్రీట్మెంట్ కోసం కొన్ని వారాలుగా విశ్రాంతి తీసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ రోజు నుంచి పూర్తి స్థాయిలో తిరిగి తన విధుల్లో నిమగ్నం అవుతున్నారని, ఆయనకు మనస్ఫూర్తిగా స్వాగతం పలకాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ప్రజల కోసం, సమాజం కోసం, దేశం కోసం పవన్ కళ్యాణ్ ఏ స్ఫూర్తితో అందరినీ నడిపించారో, అదే వేగంతో ఈ ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆయన పేర్కొన్నారు. మనం ఏం చేయగలమో పవన్ కళ్యాణ్ నాయకత్వంలో చేసి చూపిద్దామని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో సుదీర్ఘ ప్రస్థానంలో ఓపికగా ఉంటూ, స్థానం కోల్పోకుండా సమస్యలను ఎదుర్కొనే విధానాన్ని స్వయంగా కష్టపడి అనుభవాల ద్వారా నేర్చుకోవాలని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీగా ప్రతి అడుగు జాగ్రత్తగా ముందుకు వేసుకుంటూ వెళు తున్నామని, రాష్ట్ర, దేశ అభివృద్ధిలో కీలకంగా మారదామని సూచించారు. తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీలు కూటమిగా కలిసి ప్రయాణిస్తున్న తరుణంలో కొన్నిచోట్ల చిన్న చిన్న ఇబ్బందులు సహజంగానే ఉంటాయని నాదెండ్ల మనోహర్ చెప్పారు



## తీవ్ర వాయు గండం..!

మొదటి పేజీ తరువాయి...

క్రమంగా తీవ్రమై మంగళవారం నాటికి తీవ్రవాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర తీరాల సమీపానికి చేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఫలితంగా రాష్ట్రంలోని వాతావరణంలో వేగంగా మార్పులు చోటుచేసుకునే సూచనలున్నాయి. ఈ తీవ్రవాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర సహా కోస్తాంధ్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు పడే ముప్పు ఉనందున అధికారులు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉన్నందున.... ఆయా ప్రాంతాల ప్రజలు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రాకూడదని విజ్ఞప్తి చేసింది. తీరం వెంట గంటకు తీవ్ర వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తమ పడవలతో తీరానికి తిరిగి రావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని సముద్ర తీర ప్రాంత అధికారులను, వేటగాళ్లను ఆదేశించారు. ప్రజలకు ఏమైనా అత్యవసర సహాయం లేదా సమాచారం కావాల్సి వస్తే వెంటనే సంప్రదించడానికి ప్రభుత్వం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. వేర్వేరు టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రజలు 112, 1070 లేదా 1800 425 0101 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు.




## నో యూపీఐ.. ఓన్లీ క్యాష్..!

మొదటి పేజీ తరువాయి...

చేసిన విషయం తెలిసిందే. రూ.2000 కంటే ఎక్కువ ఉన్న వాణిజ్య యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ ఛార్జీని ప్రభుత్వం ప్రతిపాదించింది. అక్టోబర్ 15 నుంచి ఈ ఛార్జీలు అమలవుతాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంకులకు ఎండీఆర్ నుంచి మినహాయింపు కావాలని ఆల్ఇండియా పెట్రోల్ పంప్ డీలర్ల సంఘం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అయితే దీనిపై ప్రభుత్వం స్పందించలేదు. అందుకే పెట్రోల్ డీలర్లు రూ.2000 మించితే యూపీఐ చెల్లింపునకు 'నో' అంటున్నారు. నగదు రూపంలోనే చెల్లించాలని పట్టుబడుతున్నారు. త్వరలో దేశమంతటా ఈ విధానం వ్యాపిస్తుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. యూపీఐ ట్రాన్సాక్షన్స్‌కు బాగా అలవాటు పడిపోయిన వినియోగదారులకు ఇది ఇబ్బందికరంగా మారవచ్చు. ఛార్జీల ప్రతిపాదన వ్యాపారుల్లో ఆందోళనకు దారితీసింది. పెట్రోల్ డీలర్లలో అయితే ఈ ఆందోళన కాస్తంత ఎక్కువగానే ఉంది. ఓవైపు నిర్వహణ ఖర్చుల పెరుగుదల, మరోవైపు తగ్గని ముడిచమురు ధరలు నడుమ ఎండీఆర్ పేరిట విధించే ఈ అదనపు ఛార్జీలను తాము భరించలేమని వాపోతున్నారు. ఈ తరుణంలో తాము నగదు చెల్లింపునకే పరిమితం కావడానికి సిద్ధమయ్యామని తెలిపారు.

## సుప్రీంకు దానం

**(హైదరాబాద్ - జయజయహే)**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారింది. పార్టీ ఫిరాయింపుల కేసులో సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించి, ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు.. తీర్పు ప్రతులను అసెంబ్లీ స్పీకర్, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశించింది. తాజాగా దానం నాగేందర్ అనర్హత వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. పార్టీ ఫిరాయింపుల కేసులో తెలంగాణ హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిని పార్టీ ఫిరాయింపుగా పేర్కొంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సెప్టెంబర్ 18న తీర్పు ఇచ్చింది. 2024 ఏప్రిల్ 23 నుంచే ఆయన అనర్హుడని ప్రకటిస్తూ ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. హైకోర్టు తీర్పుపై స్టే కోరుతూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అనర్హత పై దానం నాగేందర్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసే అవకాశం ఉండడంతో ముందుగానే బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కెవియట్ పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పిటిషన్ పై తమ వాదన వినాలని బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కెవియట్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు తీర్పు పై స్టే కోరుతున్న దానం నాగేందర్ పిటిషన్ పై సుప్రీంకోర్టు లో విచారణ పై ఉత్కంఠ నెలకొంది. ఖైరతాబాద్ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుందా, లేక దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారా అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# నేడు విశాఖ వేదికగా సంస్కృతి గజల్స్ సందడి!

## తొలి సారి సోలో ప్రదర్శన

### వందలాది ప్రదర్శనలతో తండ్రి గజల్ శ్రీనివాస్‌తో తనయ పోటీ

**(విశాఖపట్నం, జయ జయహే)**





గజల్ సంగీత ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న ప్రముఖ వాగ్గేయకారుడు గజల్స్ శ్రీనివాస్ కళా వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన కుమార్తె కేసిరాజు సంస్కృతి తన గజల్ గానంతో సంగీత ప్రియులను అలరిస్తున్నారు. చిన్ననాటి నుంచే సంగీతంపై ఆసక్తిని పెంచుకున్న సంస్కృతి.. కేవలం నాలుగేళ్ల వయసు నుంచే తండ్రి వద్ద గజల్ సంగీతంలోని మెళకువలను నేర్చుకుంటూ కళా ప్రస్థానాన్ని ప్రారంభించారు.ప్రస్తుతం 26 ఏళ్ల వయసులో ఉన్న సంస్కృతి, చిన్నతనంలోనే వేదికలపై తన ప్రతిభను చాటుకుంటూ అంచెలంచెలుగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తండ్రి గజల్ సంప్రదాయాన్ని అనుసరిస్తూనే తనదైన గానశైలిని అభివృద్ధి చేసుకుని ప్రేక్షకుల మనసులను ఆకట్టుకుంటున్నారు. దేశంలోనే కాకుండా అమెరికాలోనూ పలు కళా ప్రదర్శనలు ఇచ్చి తన ప్రతిభను చాటుకున్నారు. హైదరాబాద్, తిరుపతి, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఆమె ఇచ్చిన ప్రదర్శనలకు సంగీతాభిమానుల నుంచి మంచి స్పందన లభించింది.

**తొలిసారి విశాఖలో గజల్ గాన మాధుర్యం**

ఇప్పటి వరకు పలు నగరాల్లో తన గానంతో అలరించిన సంస్కృతి తొలిసారిగా విశాఖపట్నంలో ప్రత్యేక గజల్స్ కార్యక్రమంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరగనుంది. సంస్కృతి తొలిసారి విశాఖ వేదికపై ప్రత్యక్షంగా గజల్స్ ఆలపించనుండటంతో సంగీత ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. ఆమె గాన ప్రదర్శన కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**'చిరు గజళ్ళు'తో ప్రత్యేక గుర్తింపు**

సంస్కృతి గాన ప్రతిభకు ఆమె రూపొందించిన 'చిరు గజళ్ళు' ప్రత్యేక ఆల్బమ్స్ మంచి ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఈ ఆల్బమ్స్ ఇప్పటికే వేలాది మంది శ్రోతలను ఆకట్టుకున్నాయి. గజల్ సంగీతాన్ని యువతకు మరింత చేరువ చేసేలా ఆమె చేస్తున్న ప్రయత్నాలు సంగీతాభిమానుల ప్రశంసలు అందుకుంటున్నాయి.

గజల్ అంటే కేవలం సంగీత రూపమే కాకుండా భావాన్ని, పదాన్ని, స్వరాన్ని సమన్వయం చేసే ప్రత్యేక కళ. అలాంటి గజల్ గానాన్ని చిన్న వయసులోనే తండ్రి నుంచి నేర్చుకుని, వేదికలపై తన ప్రతిభను నిరూపించుకుంటూ సంస్కృతి ముందుకు సాగుతున్నారు. తండ్రి నుంచి అందుకున్న కళా వారసత్వాన్ని కేవలం కొనసాగించడమే కాకుండా తన గాన ప్రతిభతో దానికి కొత్త తరాన్ని అనుసంధానం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

**అవార్డులతో ప్రతిభకు గుర్తింపు**

సంస్కృతి కళా ప్రస్థానంలో ఆమె ప్రతిభకు లభించిన పలు గుర్తింపులు, పురస్కారాలు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకుని తన ప్రతిభను చాటుకున్నారు. చిన్న వయసులోనే ప్రారంభమైన ఆమె కళా ప్రయాణం నేడు అంతర్జాతీయ వేదికల వరకు విస్తరించడం విశేషం.

తండ్రి గజల్ వారసత్వాన్ని అందిపుచ్చుకుని, నాలుగేళ్ల వయసు నుంచే సాగుతున్న ఈ సంగీత ప్రయాణం.. నేడు 26 ఏళ్లకు చేరుకుని ప్రత్యేక స్థాయికి ఎదిగింది. అమెరికా నుంచి హైదరాబాద్, తిరుపతి, విజయవాడ వరకు పలు వేదికలపై తన గానంతో ప్రేక్షకులను అలరించిన సంస్కృతి, ఇప్పుడు విశాఖ ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.

కళాభారతి వేదికగా ఆదివారం జరగనున్న సంస్కృతి గజల్స్ కార్యక్రమం సంగీత ప్రియులకు ప్రత్యేక అనుభూతిని అందించనుంది. తొలిసారిగా విశాఖలో ఆమె గానాన్ని ప్రత్యక్షంగా వినే అవకాశం రావడంతో ఈ కార్యక్రమంపై ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. గజల్ సంగీతాభిమానులను అలరించేలా ఈ కార్యక్రమం సాగనుంది.

# ప్రజల దాహం తీర్చలేని ప్రభుత్వం ఎందుకు?

మొదటి పేజీ తరువాయి...

రోజులకోసారి నీరు వచ్చే పరిస్థితి ఉందని, ట్యాంకర్ల ద్వారా కూడా నీరు దొరకడం లేదని ప్రచార కార్యక్రమాలను, రాజకీయ విమర్శలు పక్కనపెట్టి తక్షణమే విశాఖ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం విశాఖ అభివృద్ధిని అడ్డుకునేలా విలువైన భూములను అనామక కంపెనీలకు కట్టబెడుతున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు.

**విశాఖ నీటి సమస్యపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి**

ముఖ్యమంత్రి విశాఖపట్నానికి వచ్చినప్పుడు నగర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యపై మాట్లాడతారని ఆశించాం. కానీ విశాఖలో నీటి సమస్య ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలుసు. మూడు రోజుల నుంచి నాలుగు రోజులకోసారి నీరు వచ్చే పరిస్థితి ఉంది. కనీసం ట్యాంకర్ల ద్వారా నీరు కొనుక్కుందామన్నా దొరకడం లేదు. పేదవాడి నుంచి ఉన్నవాడి వరకు అందరూ రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. ముఖ్యమంత్రి వచ్చినప్పుడు రేపటి నుంచి నీటి సమస్య తీరుతుందని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపుతారని ప్రజలు ఎదురుచూశారు. కానీ ఆ సమస్యను పక్కనపెట్టి ప్రతిపక్షాలపై, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై, జగన్ గారిపై విమర్శలు చేయడానికి వేదికను ఉపయోగించుకున్నారు. ఈ ప్రభుత్వం విశాఖ ప్రజలకు కనీసం మంచి నీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉంది. అసలు ఈ ప్రభుత్వం ఎందుకు, ఈ పరిపాలన ఎందుకు అని ప్రజలు ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చింది.

**విశాఖ భూములపై ఎన్నో ప్రశ్నలు**

2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత విశాఖపట్నంలో వేల కోట్ల రూపాయల విలువైన భూములను బినామీలకు కట్టబెడుతున్నారు. ఊరూ పేరు లేని కంపెనీలకు వందలాది ఎకరాలు ఇచ్చారు. వాటిలో ఒక్క కంపెనీ అయినా నిర్మాణం చేపట్టిందా? స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చిందా? ఎందుకు ఇవ్వలేదు? ఇచ్చిన కంపెనీల్లో చాలా వరకు రియల్ ఎస్టేట్ కంపెనీలుగా కనిపిస్తున్నాయి. విశాఖ అభివృద్ధి చెందితే అమరావతి రియల్ ఎస్టేట్‌కు దెబ్బ తగులుతుందనే ఉద్దేశంతో విశాఖ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని స్పష్టంగా అర్థమైపోతుంది. విశాఖకు నీరు కూడా అందకుండా పోతే పెట్టుబడిదారులు ఈ నగరం వైపు ఎందుకు చూస్తారు? విశాఖను అభివృద్ధిని పణంగా పెట్టి మరీ అమరావతిని ప్రమోట్ చేసుకోవాలన్న ఆలోచన రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదు.

**స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలి**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.1,000 కోట్లు ఇచ్చాం, రూ.10 వేల కోట్లు ఇచ్చాం, రూ.20 వేల కోట్లు ఇచ్చామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఆ డబ్బులు ఎందుకోసం ఇచ్చారు? బ్యాంకు రుణాలు చెల్లించకపోతే ప్లాంట్ వేలానికి వెళ్లే పరిస్థితిని నివారించేందుకు కేంద్రం నిధులు విడుదల చేసి ఉంటే, దాన్ని కార్మికులను, ప్లాంట్‌ను ఉద్ధరించినట్లు చెప్పుకోవడం ఏమిటి? కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో 6,500 మందిని ఎందుకు తొలగించారు? పర్మినెంట్ ఉద్యోగులకు ఎందుకు వీఆర్ఎస్ ఇచ్చారు? ఈ రెండున్నరేళ్లలో కాంట్రాక్ట్, పర్మినెంట్ ఉద్యోగులు కలిపి దాదాపు 10 నుంచి 12 వేల మందిని తొలగించిన అంశానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలి. నాలుగున్నర నెలలుగా కార్మికులకు జీతాలు లేవు. ప్లాంట్ భవిష్యత్తు ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలి. ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఉద్దేశమే లేకపోతే ఇప్పటివరకు ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయలేదు? కార్మికులకు ఎందుకు భరోసా ఇవ్వలేదు?

**ఇళ్ల పట్టాల పేరుతో డ్రామా వద్దు**

ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఇలాంటి కార్యక్రమాలు చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. 2019 నుంచి 2024 వరకు జగన్ గారి ప్రభుత్వం పేద కుటుంబాలకు భూములు ఇచ్చి, ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. విశాఖ నగరంలో సుమారు 1.30 లక్షల కుటుంబాలకు సొంత స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించుకునే కార్యక్రమం చేపట్టాం. ప్రభుత్వం మారిన తర్వాత ఆ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకున్నారు. పేదల సొంత ఇంటి కలను ఆపేశారు. 2019లో జీవో 463 ద్వారా అర్హులైన బీపీఎల్ కుటుంబాలకు ప్రభుత్వ భూములను రూపాయికే రెగ్యులరైజ్ చేసే అవకాశం కల్పించాం. 2021లో జీవో 225, 2023లో మరిన్ని రాయితీలు, జీవో 60 ద్వారా పట్టాలు పొందిన వారికి హక్కులు కల్పించాం. గాజువాక హౌస్ కమిటీ సమస్యకు కూడా జీవోలు తీసుకొచ్చి పరిష్కారం చూపాం. వీటి ద్వారా మా ప్రభుత్వం దాదాపు రూ.16 వేల కోట్లను భరించి పేద కుటుంబాలకు ప్రయోజనం కల్పించింది. ఇప్పుడు అదే కార్యక్రమాలను కొత్తవిగా చూపించుకోవడం ఎన్నికల స్టంట్ తప్ప మరొకటి కాదు.

**ముందు ప్రజల దాహం తీర్చండి**

ప్రజలకు సూపర్ సిక్స్ హామీలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు విశాఖ ప్రజలు పెన్షన్లు వద్దు, మహిళలకు ఇస్తామన్న రూ.1,500 వద్దు, పిల్లలకు ఇస్తామన్న రూ.15 వేలు వద్దు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేలూ వద్దు.. కనీసం గుక్కెడు మంచి నీళ్లు ఇవ్వండి అని అడిగే పరిస్థితి వచ్చింది. ముడసర్లోవ, మేదరగడ్డ, రైవాడ రిజర్వాయర్లు ఎండిపోయాయి. తాడిపూడి నుంచి నీరు రావడం లేదు. పోలవరం నీరు అనకాపల్లి వరకు వచ్చిందని చెబుతున్నారు. మరి ఆ నీరు విశాఖకు ఎందుకు రాలేదు? ఈ సమస్యపై ఒక్క మంత్రి అయినా సమీక్ష నిర్వహించారా? వచ్చే ఏడాది వర్షాలు పడతాయని చెప్పడానికి ముఖ్యమంత్రిని ప్రజలు ఎన్నుకోలేదు. కరవు పరిస్థితులు వచ్చినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి, నగరానికి నీరు ఎలా అందించాలి, పరిశ్రమలకు నీరు ఎలా ఇవ్వాలన్న దానిపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. రాజకీయ విమర్శలు మానేసి తక్షణమే విశాఖ ప్రజల దాహార్తి తీర్చే చర్యలు చేపట్టాలని గుడివాడ్ అమర్నాథ్ డిమాండ్ చేశారు.

# అనుమతులు లేకుండానే భారీ రిసార్ట్ నిర్మాణం?





### గ్రుడ్డిగూడ--రణజిలాడ గ్రామాల మధ్య నిర్మాణంపై అధికారుల తీరుపై అనుమానాలు

### పంచాయతీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**అరకులోయ, సెప్టెంబర్ 19 , జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పద్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రుడ్డిగూడ--రణజిలాడ గ్రామాల మధ్య భారీ రిసార్ట్ నిర్మాణం జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు బహిరంగంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు, భూమి హక్కులు, నిర్మాణ నిబంధనలకు సంబంధించిన అంశాలను పరిశీలించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం, భూమి బదలాయింపు నిబంధనలు వర్తించే పరిస్థితుల్లో నిర్మాణానికి సంబంధించిన భూమి స్వరూపం, యాజమాన్య హక్కులు, అనుమతులను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని వారు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన పంచాయతీ, రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవడం వల్లే పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇక అధికారులు మామూళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వినిపిస్తున్నప్పటికీ, వాటికి సంబంధించి స్వతంత్రంగా నిర్ధారిత ఆధారాలు బయటపడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులు, భూమి వివరాలు, నిర్మాణ హక్కులను ఉన్నతాధికారులు విచారించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.



## ఫిల్మ్ నగర్ భూ కేటాయింపుపై సీఎం హామీ

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19: (జయ జయహే)**

ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కు భూమి కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, పి. విష్ణు కుమార్ రాజులు సీఎం చంద్రబాబు నాయుడుకు శనివారం వినతి పత్రాన్ని అందించారు. 2014 - 19 టీడీపీ ప్రభుత్వ హయంలో ఫిల్మ్ నగర్ కు శంకుస్థాపన చేసిన చంద్రబాబు తిమ్మాపురంలో 5 ఎకరాల భూమి కేటాయించారు. అయితే ఆ ఉత్తర్వుల్లో కొన్ని సాంకేతిక అంశాలు పేర్కొనకపోవడం వల్ల ఆ ప్రతిపాదన ముందుకు వెళ్లలేదు. సాంకేతిక అంశాలు సరి చేస్తూ జీఓ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే హోదాలో గంటా గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లను ప్రత్యేకంగా కలిసి కోరారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి విశాఖ వచ్చిన సీఎం దృష్టికి ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భూ కేటాయింపు విషయం ఎమ్మెల్యేలు మరోసారి తీసుకువెళ్లగా ఆయన తన కార్యదర్శి ప్రద్యుమ్నతో మాట్లాడారు. వెంటనే భూ కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని ప్రద్యుమ్నకు సీఎం సూచించారు. ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భూ కేటాయింపు వేగవంతం చేయాలని సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సంబంధిత అధికారులకు జారీ చేసిన లేఖను జత చేసి సీఎంకు అందజేశారు.



## ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

### ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పిలుపు

**కాకినాడ, సెప్టెంబర్ 19:(జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు, పిఠాపురం శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ ఈ నెల 21, 22 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించనున్న రెండు రోజుల పర్యటనను విజయవంతం చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ జనసేన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.శనివారం కాకినాడలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో పిఠాపురం పట్టణం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాలకు చెందిన జనసేన పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సమావేశమై రెండు రోజుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులతో చర్చించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పలు కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నారని ఎంపీ తెలిపారు.అలాగే ఈ నెల 22వ తేదీన పిఠాపురం పట్టణంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని ఈ సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి ప్రజలు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఎంపీ సూచించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు,కౌడా చైర్మన్ తలాటం సత్య, గోదావరి ఇస్టన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, డా.బుర్రా దివ్యరాజ్ నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సుతో పాటు స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీరు కావాలి

### భారీ కృత్రిమ మేధస్సు కేంద్రాల కన్నా ముందు పర్యావరణ సామర్థ్యాన్ని పరిశీలించాలి

### పర్యావరణ పరిరక్షణ వాది బొలిశెట్టి సత్యనారాయణ

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19, జయ జయహే**



భారత్‌ను కృత్రిమ మేధస్సు, డిజిటల్ మౌలిక వసతులలో ప్రపంచ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రజల ఆరోగ్యం, స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీరు, ప్రకృతి పరిరక్షణను విస్మరించకూడదని పర్యావరణ పరిరక్షణవాది బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు.యేల్ పర్యావరణ పనితీరు సూచిక--2026 ప్రకారం 177 దేశాల్లో గాలి నాణ్యతలో భారత్ 7.89 పాయింట్లతో 175వ స్థానంలో ఉందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇవి పర్యావరణ పరిస్థితులపై హెచ్చరికలుగా పరిగణించాలన్నారు.భారీ కృత్రిమ మేధస్సు కేంద్రాలకు అధిక విద్యుత్, నీరు, భూమి, శీతలీకరణ వ్యవస్థలు అవసరమవుతాయని పేర్కొంటూ, వాటికి అనుమతులు ఇచ్చే ముందు నీటి లభ్యత, విద్యుత్ వినియోగం, భూవినియోగ మార్పులు, గాలి నాణ్యత, వ్యర్థాల నిర్వహణ, జీవవైవిధ్యం, ప్రజారోగ్యంపై సమగ్ర పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేయాలని కోరారు.కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంస్థలు ప్రాంతీయ పర్యావరణ భరిత సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు భారీ కృత్రిమ మేధస్సు కేంద్రాలను ప్రోత్సహించే ముందు పర్యావరణం, నీటి వనరులు, ప్రజారోగ్యంపై సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

"భారత్ కృత్రిమ మేధస్సు శక్తిగా ఎదగాలి. అయితే ప్రకృతిని, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టకుండా పర్యావరణ పరిరక్షణతో కూడిన అభివృద్ధి జరగాలి" అని బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు.



## భారత్‌లో ఆశాజనక అభివృద్ధి

(సి.హెచ్.ప్రతాప్)

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితులతో కొట్టుమిట్టాడుతున్న వేళ భారత ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ ఇచ్చిన తాజా అంచనా ఆశాజనక సంకేతాన్ని అందిస్తోంది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి భారత వాస్తవ జీడీపీ వృద్ధి అంచనాను గతంలో పేర్కొన్న 6 శాతం నుంచి 7 శాతానికి మూడీస్ పెంచింది. పశ్చిమాసియా సంక్షోభం, ఇంధన ధరల ఒత్తిడి వంటి బాహ్య సవాళ్ల మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ చూపిన స్థైర్యం ఈ పెంపునకు ప్రధాన కారణంగా పేర్కొంది.

2026 క్యాలెండర్ సంవత్సరపు తొలి ఆరు నెలల్లో భారత ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2025లో నమోదైన 7.3 శాతంతో పోలిస్తే ఇది బలమైన గమనాన్ని సూచిస్తోంది. ప్రైవేటు వినియోగం, ప్రభుత్వ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడుల పునరుజ్జీవన సంకేతాలు, సేవల రంగం బలం ఈ వృద్ధికి తోడ్పడినట్లు మూడీస్ పేర్కొంది.

ఈ అంచనాలో అత్యంత ప్రాధాన్యమైన అంశం దేశీయ డిమాండ్ బలం. ప్రపంచ పరిణామాలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ భారత వినియోగ వ్యవస్థ నిలకడగా కొనసాగడం ఆర్థిక వ్యవస్థకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తోంది. అదే సమయంలో మౌలిక సదుపాయాలపై నిరంతర పెట్టుబడులు ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తున్నాయి. ప్రైవేటు పెట్టుబడులు కూడా పుంజుకుంటే వృద్ధికి మరింత విస్తృతమైన ఆధారం ఏర్పడే అవకాశం ఉంటుంది.

అయితే 7 శాతం అంచనాను విజయ ప్రకటనగా మాత్రమే చూడటం సరికాదు. మూడీస్ స్వయంగా పలు ప్రమాదాలను గుర్తుచేసింది. పశ్చిమాసియా సంక్షోభం కొనసాగి ముడిచమురు ధరలు అధికంగా ఉంటే ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరగవచ్చు. 2026--27లో సగటు ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉండవచ్చని మూడీస్ అంచనా వేసింది; ఇంధన ధరలు మరింత పెరిగితే అది దాటే అవకాశం ఉందని హెచ్చరించింది.

మరో సవాలు ఎల్‌నినో. రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం పడితే ఆహార ఉత్పత్తి, ధరలు, గ్రామీణ వినియోగంపై ప్రభావం చూపవచ్చు. అధిక ఇంధన, ఎరువుల దిగుమతి వ్యయం, బాహ్య డిమాండ్ బలహీనత, పశ్చిమాసియా నుంచి వచ్చే నగదు బదిలీలు తగ్గడం వంటి అంశాలు కూడా చెల్లింపుల సమతుల్యతపై ఒత్తిడిని పెంచవచ్చు.

ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ కూడా కీలకమే. అధిక ప్రభుత్వ రుణభారం, వడ్డీ వ్యయాలు, రక్షణ--మౌలిక సదుపాయాల వ్యయ అవసరాల మధ్య ఆర్థిక లోటును క్రమంగా తగ్గించడం సవాలుగా ఉంటుంది. మూడీస్ భారత రేటింగ్‌ను బీఏఏ3గా, స్థిర దృక్పథంతో కొనసాగించడం వృద్ధిపై విశ్వాసంతో పాటు ఈ పరిమితులనూ ప్రతిబింబిస్తోంది.

అందువల్ల 7 శాతం వృద్ధి అంచనాను లక్ష్యానికి చేరుకున్న విజయంగా కాకుండా, మరింత నాణ్యమైన వృద్ధికి వచ్చిన అవకాశంగా చూడాలి. పెట్టుబడులు పెరగాలి. ఉత్పాదక ఉపాధి విస్తరించాలి. తయారీ రంగం మరింత బలపడాలి. గ్రామీణ డిమాండ్‌కు స్థిరత్వం రావాలి. ద్రవ్యోల్బణ నియంత్రణతో పాటు ప్రభుత్వ వ్యయ నియంత్రణ కూడా కొనసాగాలి.

వృద్ధి వేగం ముఖ్యం. కానీ ఆ వృద్ధి ఎంత విస్తృతంగా ప్రజల ఆదాయాలను, ఉపాధిని, జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందన్నదే అసలు కొలమానం. మూడీస్ 7 శాతం అంచనా భారత ఆర్థిక సామర్థ్యంపై నమ్మకాన్ని చూపుతోంది. ఇప్పుడు ఆ నమ్మకాన్ని స్థిరమైన, సమతుల్యమైన, ప్రజలకు విస్తృత ప్రయోజనం చేకూర్చే వృద్ధిగా మార్చడం ముందున్న అసలైన పరీక్ష

# కేవటుడు.. సేవలోని పవిత్రత

## సాధారణ వృత్తిలో అసాధారణ సేవ

**రామకథా సంప్రదాయంలో కేవటుడు ఒక సాధారణ పడవ నడిపే వ్యక్తి. అరణ్యవాసానికి బయలుదేరిన శ్రీరాముడు, సీత, లక్ష్మణులు గంగానదిని దాటాల్సిన సమయంలో అతని సహాయం కోరుతారు. రాజభవనాల్లో నివసించిన శ్రీరాముడు ఇప్పుడు అరణ్యవాసిగా అతని ముందు నిలుస్తాడు. కేవటుడు రాజాధికారాన్ని కాకుండా శ్రీరామునిలోని మానవత్వాన్ని, ధర్మాన్ని గుర్తిస్తాడు. తనకు అందుబాటులో ఉన్న చిన్న పడవతో వారిని అవతలి ఒడ్డుకు చేరుస్తాడు.**




కేవటుడి వద్ద అపారమైన సంపద లేదు. పెద్ద పదవి, సైనిక శక్తి, రాజకీయ పలుకుబడి ఏదీ లేదు. అయినప్పటికీ అవసరమైన సమయంలో తన వృత్తి నైపుణ్యాన్ని సేవగా మార్చాడు. అందువల్ల అతని పని సాధారణ ప్రయాణ సదు-పాయంగా కాకుండా భక్తి, వినయం, మానవత్వం కలిసిన పవిత్ర కార్యంగా నిలిచింది.

### ప్రతిఫలాన్ని తిరస్కరించిన హృదయం

శ్రీరాముడు ప్రయాణానికి ప్రతిఫలం ఇవ్వబోయినప్పుడు కేవటుడు దానిని స్వీకరించలేదని ప్రజాదరణ పొందిన రామకథ చెబుతుంది. తాను ప్రయాణికులను నది దాటిస్తానని, శ్రీరాముడు జీవులను సంసారసాగరం దాటిస్తాడని చెప్పే అతని భావన సేవలోని ఆధ్యాత్మికతను తెలియజేస్తుంది. నిజమైన సేవ వ్యాపార లావాదేవీ కాదని, అది రెండు హృదయాల మధ్య ఏర్పడే మానవీయ అనుబంధమని ఈ సందర్భం సూచిస్తుంది.

దీని అర్థం సేవ చేసే వ్యక్తి తన శ్రమకు వేతనం తీసుకోకూడదని కాదు. ప్రతి కార్మికుడికి న్యాయమైన ప్రతిఫలం లభించాలి. అయితే కేవటుని కథలో ప్రధానమైన విషయం, అవసరంలో ఉన్న వ్యక్తిని కేవలం లాభానికి అవకాశంగా చూడకపోవడం.

### వృత్తికి గౌరవం---మనిషికి సమానత్వం

కేవటుడు తన పనిని తక్కువగా భావించలేదు. పడవ నడపడం తన జీవనాధారమైనప్పటికీ, దానిని బాధ్యతతో, నైపుణ్యంతో నిర్వహించాడు. సమాజంలో వృత్తుల ఆధారంగా మనుషులను ఉన్నతులు, అధములుగా విభజించే ధోరణికి అతని పాత్ర సవాలు విసురుతుంది. పని స్వభావం మనిషి గౌరవాన్ని నిర్ణయించదు; ఆ పనిని నిర్వహించే నిజాయితీ, నిబద్ధత అతని విలువను తెలియజేస్తాయి.

ఆధునిక సమాజం వైద్యుడు, అధికారి, శాస్త్రవేత్త చేసే సేవను గౌరవిస్తుంది. కానీ పారిశుద్ధ్య కార్మికుడు, డ్రైవర్, రైతు, నిర్మాణ కార్మికుడు లేదా ఇంటి సహాయకుడు చేసే పనిని అదే స్థాయిలో గుర్తించదు. వాస్తవానికి వీరిలో ఏ ఒక్కరి సేవ నిలిచిపోయినా సామాజిక జీవనం స్తంభిస్తుంది.

### నేటి సమాజంలోని కేవటులు

అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ నడిపే డ్రైవర్, రాత్రింబవళ్లు రోగులను చూసుకునే నర్సు, వరదల్లో ప్రజలను రక్షించే సిబ్బంది, మారుమూల ప్రాంతాల్లో పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు---వీరందరూ సమాజాన్ని కష్టాల ఒడ్డునుంచి భద్రతా తీరానికి చేర్చే ఆధునిక కేవటులే.

అయితే వీరిలో చాలామందికి తగిన వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక గౌరవం లభించడం లేదు. సేవలను ఉపయోగించుకుంటూనే సేవకులను చిన్నచూపు చూడటం తీవ్రమైన సామాజిక వైరుధ్యం. కేవటుని పాత్ర ప్రతి శ్రమకూ గౌరవం ఇవ్వాలని గుర్తుచేస్తుంది.

### ప్రచారం కోసం కాకుండా పరమార్థం కోసం

నేడు సేవా కార్యక్రమాలకు ప్రచారం కూడా ప్రధానమవుతోంది. సహాయం అందించే సమయంలో బాధితుల చిత్రాలను తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడం వారి గౌరవాన్ని దెబ్బతీయవచ్చు. ప్రచారం ఇతరులను ప్రేరేపించేందుకు ఉపయోగపడితే మంచిదే; కానీ సహాయం పొందిన వ్యక్తి బాధను స్వప్రచారానికి ఉపయోగించడం సేవలోని పవిత్రతను తగ్గిస్తుంది.

### ప్రతి ఒక్కరి చేతిలో ఒక పడవ

ప్రతి మనిషి వద్ద ఇతరులను కష్టాల తీరం నుంచి గమ్యమనే అవతలి ఒడ్డుకు చేర్చగల ఏదో ఒక "పడవ" ఉంటుంది. కొందరికి జ్ఞానం ఆ పడవగా మారితే, మరికొందరికి ధనం, సమయం, అనుభవం లేదా ధైర్యాన్నిచ్చే మాట సహాయక సాధనాలవుతాయి. మనం అందించే సహాయం ఎంత పెద్దదనేది కాదు; అవసరమైన సమయంలో దానిని ఎంత హృదయపూర్వకంగా అందించామన్నదే ముఖ్యం.

కేవటుడు మనకు అందించే సందేశం ఇదే---వృత్తిని సేవగా, శ్రమను భక్తిగా భావిస్తూ, ప్రతి మనిషినీ సమానంగా గౌరవించినప్పుడు సాధారణమైన పని కూడా పవిత్ర కార్యంగా మారుతుంది.

### ముగింపు

ఒక ఊరు, పట్టణం, రాష్ట్రం లేదా దేశం ఇతరుల దృష్టిలో మంచిపేరు పొందాలంటే కేవలం అక్కడి అభివృద్ధి, సంపద లేదా సౌకర్యాలు మాత్రమే సరిపోవు. ఆయా ప్రాంతాలలోని అధికారులు, ధనవంతులు, వ్యాపారులు, ఉద్యోగులు, కేవటుడి వంటి సామాన్య కార్మికులు, సాధారణ పౌరులు---అందరూ ఇతరుల పట్ల న్యాయబద్ధంగా, మర్యాదగా, మానవీయంగా ప్రవర్తించాలి. ప్రతి వ్యక్తికీ గౌరవం లభించి, అవసరమైన వారికి సహాయం అందినప్పుడే ఆ ప్రాంతం నిజమైన ఆదర్శ ఊరుగా, పట్టణంగా, రాష్ట్రంగా లేదా దేశంగా గుర్తింపు పొందుతుంది..

ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు



# వేడుక కావాలి.. విషాదం కాదు!

## నిమజ్జన వేళ అప్రమత్తతే రక్ష

**వినాయక చవితి అంటే భక్తి.. ఆనందం.. సందడి. పది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించిన గణనాథుడికి నిమజ్జనంతో వీడ్కోలు పలకడం ఆనవాయితీ. యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. అయితే చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఈ సంబరాలను విషాదంగా మార్చే ప్రమాదం ఉంది.**



సంగారెడ్డి జిల్లాలో ఇటీవల నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలచివేసింది. పండుగ పూట ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. ఇలాంటి ఘటనలు నిమజ్జన వేళ భద్రతపై మరింత అప్రమత్తత అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.

### ఉత్సాహం ఉండాలి.. విచక్షణ కోల్పోవద్దు

నిమజ్జన శోభాయాత్రలో యువత ఉత్సాహంగా పాల్గొనడం సహజం. కానీ డీజేల మోత, అధిక శబ్దాల మధ్య విచక్షణ కోల్పోవడం ప్రమాదాలకు దారితీస్తోంది. అలాగే అధిక సౌండ్‌లకు కొందరు అనారోగ్యానికి గురికావడం కూడా తరచుగా జారుతుంది అలాంటి వారి విషయాల్లో జాగ్రత అవసరం అలాగే వాహనాలపైకి ఎక్కడం, కదులుతున్న ట్రాక్టర్లు, లారీలను అంటిపెట్టుకుని ప్రయాణించడం, ప్రమాదకరంగా నృత్యాలు చేయడం వంటివి చేయకూడదు. క్షణిక ఉత్సాహం జీవితాంతం పశ్చాత్తాపాన్ని మిగల్చవచ్చు. సంబరం ఎంత ముఖ్యమో.. సంయమనం అంతకంటే ముఖ్యం.

### విద్యుత్ తీగలతో జాగ్రత్త

భారీ విగ్రహాల ఊరేగింపులో విద్యుత్ తీగల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. విగ్రహం ఎత్తు, వాహనం పరిమాణం, మార్గంలోని విద్యుత్ లైన్లను ముందుగానే పరిశీలించాలి. అవసరమైన చోట విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో సరఫరాను నిలిపివేసిన తర్వాతే ఊరేగింపును కొనసాగించాలి. విద్యుత్ తీగ తగిలితే జరిగే ప్రమాదం ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది.

### విగ్రహం నిమజ్జనం కావాలి.. మనిషి కాదు

చెరువులు, కుంటలు, నదుల్లో నీటి లోతు ఎక్కడెంత ఉంటుందో తెలియదు. అడుగున గుంతలు, బురద, జారుడు నేల వంటి ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఈత వచ్చినా తెలియని నీటిలోకి దిగడం సాహసం కాదు.. నిర్లక్ష్యం. ముఖ్యంగా పిల్లలను తల్లిదండ్రులు ఒంటరిగా వదిలేయకూడదు. రక్షణ సిబ్బంది సూచనలు తప్పక పాటించాలి.

### నిమజ్జనం కోసం విగ్రహం నీటిలోకి వెళ్లాలి.. మనుషులు కాదు.

భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

నిమజ్జన ప్రాంతాల్లో అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. బారికేడ్లు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, వైద్య బృందాలు, తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలి. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రజలు కూడా నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలి. బారికేడ్లు దాటడం, నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లడం, మద్యం సేవించి నీటిలోకి దిగడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి.

వినాయక చవితి ప్రతి ఇంటా వెలుగులు నింపే పండుగ. నిమజ్జనం అనంతరం ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరినప్పుడే ఆ వేడుకకు నిజమైన పరిపూర్ణత.

విఘ్నాలను తొలగించే గణపతికి వీడ్కోలు పలికే వేళ.. మన అజాగ్రత్తే విఘ్నంగా మారకూడదు.

వినాయకుడికి వీడ్కోలు పలుకుదాం.. ప్రాణాలకు కాదు. వేడుక ముగిసిన వేళ ప్రతి ఇంట్లోనూ నవ్వులు వెలగాలి.. కన్నీళ్లు కాదు.

జి. అజయ్ కుమార్



# బంధం అనగా బందీ కాదు బాధ్యత




మనిషి జన్మించిన నాటి నుండి కాదు తల్లి గర్భములో ఉన్నప్పుడే బంధం ఏర్పడుతుంది. జన్మించిన నాటి నుండి రకరకాలైన బంధాలలో బ్రతుకుతాడు మానవుడు. బంధం అనేది కంటికి కనిపించదు. హృదయాంతరాలలో బందీ అయ్యి ఉండేదే బంధం. బంధించడం బంధం కాదు. బాధ్యత తీసుకోవడమే బంధం. జీవుల యొక్క మనసులకు మధ్యలో అనగా మనసుకి మనసుకి వంతెనే బంధం. నిజమైన బంధానికి మూడు సూత్రాలు ఉండాలి.నమ్మకం ఉండాలి, స్వార్థం ఉండకూడదు, కష్టంలో విడువకుండా ఉండాలి. సంస్కృతంలో బంధ్ అంటే కట్టడం కానీ ఇక్కడ కట్టడం అంటే తాడుతో కట్టేది కాదు, మనసుతో కట్టేది అసలైన మేటి బంధం.

### బంధంలో నాలుగు రకాలు

1. అనుబంధం
తల్లి బిడ్డలు భార్యాభర్తలు ఈ బంధంలో ఎంతో ప్రేమగా జీవిస్తారు.
2. ఆత్మబంధం
జన్మజన్మల బంధం ఇది గురు శిష్యులు భక్తుడు భగవంతుడు మధ్యలో సాగే తెగని బంధం ఇది.
3. ఋణానుబంధం
ఏదో ఋణం తీర్చుకోవడానికి కలిసే బంధం. ఋణం తీరిపోయిన తర్వాత ఈ బంధం మిగిలి ఉండదు.
4. మోహబంధం
కోరికతోనో, ఆశతోనో నగదు,స్థలము, వ్యామోహం తోనో ఏర్పడే బంధం ఇది అత్యంత ప్రమాదకరం.

### బంధానికి కావలసిన మూల పునాది పదార్థములు

నమ్మకం
బంధానికి పునాది నమ్మకమే నమ్మకం లేకపోతే బంధం నిలవదు.

గౌరవం
ప్రేమ కన్నా గౌరవం గొప్పది.ఎదుటివారిని గౌరవించినప్పుడే బంధం మంచి గా బలోపేతమవుతుంది.

సమయం
బంధానికి తగిన సమయం కేటాయించగలిగినప్పుడే బంధం కలకాలం నిలిచి ఉంటుంది.

క్షమాపణ
క్షమించేదే బంధం. బంధం లో తప్పు ఒప్పులు సర్వసాధారణం.క్షమించగలగడం వివేకం. బంధం నిలుచుటకు పునాదే క్షమాపణ.

నిస్వార్థం
నాకు ఏమిటి లాభం అనేది వ్యాపారంలో ఆలోచించాలి కానీ బంధంలో కాదు. నిస్వార్థంగా ఉన్న బంధం చరిత్రలో నిలిచిపోతుంది. మానవులందరూ బంధానికి బంధీ అయ్యి ఉండడమే నిజమైన జీవితం. జీవనం సఫలీకృతం అవ్వాలి అంటే మన అంతర్వాణి లో బంధాన్ని బంధించి తీరాలి.



రచన
ఏ.బాల సౌజన్యకుమారి
తెలుగు ఆచార్యులు,
నంది అవార్డు గ్రహీత, ఆధ్యాత్మికవేత్త,
విద్యావేత్త, ప్రవచనకర్త

# గోదావరి తీరాన భక్తి వైభవం





## శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

### యడ్ల వెంకటేష్--రథంవీధి రాయల్స్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహణ

**రాజమహేంద్రవరం: జయ జయహే: సెప్టెంబర్ 20**

ధవళేశ్వరం శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ధవళేశ్వరం రథంవీధి అంకాలమ్మగుడి సెంటర్ వద్ద గోదావరి తీరాన శనివారం సాయంత్రం లోకకళ్యాణం, సర్వజన శాంతి--సౌభాగ్యాలను ఆకాంక్షిస్తూ శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యడ్ల వెంకటేష్, రథంవీధి రాయల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కళ్యాణ మహోత్సవానికి ముందు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సమీపం నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, గొడుగు సేవతో పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తుల "గోవిందా.. గోవిందా.. శ్రీనివాసా.. వెంకటేశా.." నామస్మరణలతో ధవళేశ్వరం వీధులు మార్మోగాయి. అనంతరం స్వామివారిని అంకాలమ్మగుడి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికకు తీసుకువచ్చారు.శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవాలయ బ్రహ్మ, శ్రీ వైఖానస ఆగమ యువబ్రహ్మ, వైఖానస ఆగమ భాస్కర, విద్యావాచస్పతి, మహదాచార్య, శతాధిక ప్రతిష్ఠాపనాచార్య ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల వారి బ్రహ్మత్వంలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా శ్రీనివాస కళ్యాణాన్ని నిర్వహించారు.స్వామివారికి విశేష అలంకరణలు, పుష్పాభరణాలు, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు, సంకల్పం, పుణ్యాహవాచనం తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కన్యావరణం, వరపూజ, మధుపర్కం, జీలకర్ర--బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, అక్షింతల సమర్పణ తదితర కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.మాంగల్యధారణ ఘట్టంలో మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు పెద్ద ఎత్తున గోవింద నామస్మరణ చేశారు. అనంతరం తలంబ్రాల కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు.గోదావరి తీరాన వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, హరినామస్మరణల మధ్య జరిగిన ఈ వేడుక ఆద్యంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీనివాసుని కల్యాణాన్ని దర్శించిన భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా యడ్ల వెంకటేష్ మాట్లాడుతూ, శ్రీనివాసుని కల్యాణం జరిగే చోట మంగళం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరుస్తాయని, గోదావరి తీరాన స్వామివారి కల్యాణాన్ని నిర్వహించడం తమకు గొప్ప భాగ్యమని తెలిపారు. లోకకళ్యాణం, సర్వజన సుఖశాంతులే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సహకరించిన భక్తులు, వేదపండితులు, సేవా కార్యకర్తలు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. చివరగా స్వామివారికి మహా మంగళహారతి సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గోవింద నామస్మరణల మధ్య శ్రీనివాస కళ్యాణ మహోత్సవం ఘనంగా ముగిసింది.



# అరకు వేలి టౌన్ షిప్‌లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం

### సియ్యారి దొన్నుదొర

**అరకులోయ: సెప్టెంబర్ 19. జయ జయహే,**

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అరకు వేలి టౌన్ షిప్ లో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర పై అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అరకు టిడిపి పార్టీ ఇంచార్జ్ ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ, ప్రకృతికి పర్యాటకానికి నిలయమైన అరకు ను పరిశుభ్రంగా ఉంచుకుందామని సూచించారు. ప్రపంచ పర్యాటక ప్రాంతం ఎంతో సుందరంగా ఉండాలని ఆ బాధ్యతను మనమే తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజలంతా ఐక్యంగా అరకు ను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అరకు పర్యాటక విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ఆశయాలకు తగ్గట్టుగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మనమంతా భాగస్వామ్యం అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ కిల్లో సాయిరాం, మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి కిల్లో శ్యామ్, అరకు నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు బుడ్డి కొమ్ములు నాయుడు, మాజీ సర్పంచ్ పెట్టేలిదాసు బాబు, బిజెపి సీనియర్ నాయకుడు కిల్లో ఆనందరావు, పెదలబుడు టిడిపి పంచాయితీ అధ్యక్షుడు బోయి దామోదర్, టిడిపి సీనియర్ నాయకుడు సన్యాసిరావు, మాజీ ఎంపిటిసి వంతల వెంకటరావు, అరకు నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెట్టెలి రాజ్ కుమార్, హుకుంపేట మండలం టిడిపి సీనియర్ నాయకుడు సోమేలి లక్ష్మయ్య, ఎంపీడీవో అధికారులు తదితరులు పాల్గొన్నారు,

# జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ వజ్ర ప్రహార్ నిర్వహించిన పోలీసులు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ వజ్ర ప్రహార్ నేర నియంత్రణ లక్ష్యంగా భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం మేరకు జిల్లా వ్యాప్తంగా నేరాల కట్టడి మాదకద్రవ్యాల నిర్మూలన మరియు అసాంఘిక శక్తుల కదలికపై నిఘా ఉంచడమే ధ్యేయంగా శనివారం వేకువ జామున ఐదు గంటల నుండి అనకాపల్లి పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు ఆపరేషన్ వజ్రప్రహార్ సెర్చ్ నిర్వహించడం జరిగింది అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పి ఈ శ్రీనివాసులు పర్యవేక్షణలో కసింకోట సీఐ అల్లు స్వామి నాయుడు అనకాపల్లి టౌన్ రూరల్ ట్రాఫిక్ సిఐలు వెంకటనారాయణ ప్రేమ్ కుమార్ అశోక్ కుమార్ ఈగల్ టీం ఇన్స్పెక్టర్ నారాయణరావు మరియు సుమారు 70 మంది పోలీస్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 37 ద్విచక్ర వాహనాలు మరియు ఆరు మద్యం బాటిలను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది అలాగే నర్సీపట్నం పరిధిలో కూడా తనిఖీలు నిర్వహించడం జరిగింది కసింకోట గ్రామం నందు గల హౌసింగ్ కాలనీ పూసర్ల వీధి నందు కార్డ్ అండ్ సెర్చ్ ఆపరేషన్ భాగంగా విస్తృత తనిఖీలు చేపట్టడం జరిగింది ముఖ్యంగా ఇక్కడ మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అలాగే అనుమానం ఉన్న ప్రాంతాలు అద్దె ఇల్లు విద్యార్థుల హాస్టల్ లో ఖాళీ భవనాలు బస్ స్టాండ్లు ఇతర అనుమానస్పద ప్రదేశాలు పాత గంజాయి మరి నార్కోటిక్ కేసుల్లో ఉన్నటువంటి ముద్దాయిల ఇళ్లను పోలీసులు సోదాలు నిర్వహించారు ఈ ఆపరేషన్ లో భాగంగా మొత్తం 600 మంది వ్యక్తులను తనిఖీ చేయడం జరిగింది . 150 వాహనాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించడం సీజ్ చేయడం జరిగింది రౌడీ షీటర్లు మరియు సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులను స్పాట్లో పిలిచి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారికి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించడం జరిగింది . ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు మాదిగ ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టం ఆరోగ్యం పై చూపించే దుష్పరిమాణాలు అలాగే చట్టపరంగా తీసుకున్న చర్యలు వారికి అవగాహన కల్పించడం జరిగింది . గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని అది కుటుంబ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు వివరించారు ప్రజల తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు సంబంధించన సమాచారం తెలిసిన వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సిబ్బంది మరియు ప్రజలతో కలిసి ఆపరేషన్ వజ్ర పహార్ ప్రతిజ్ఞ నిర్వహించి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని అందరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది





## పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా

# వైసీపీ క్యాడర్ సిద్ధంగా ఉంది

### అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

**అరకులోయ, సెప్టెంబర్ 19, (జయ జయహే)**

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఒక్క సీటు కూడా కోల్పోకుండా విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.అరకులోయలో, పార్టీ నాయకులు కార్యకర్తలు, సర్పంచ్, ఎంపీటీసీ జెడ్పిటిసిల పదవులకు పోటీ చేయాలని భావిస్తున్న పార్టీ ఆశావహులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీలో ఏవైనా విభేదాలు, సమస్యలు ఉంటే వాటిని గ్రామస్థాయిలోనే చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కేవలం పదవులు, టికెట్ల కోసం పార్టీలోకి వచ్చేవారు ఆశలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించే విధంగా నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పనితీరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో బలంగా మారుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా పెన్షన్ల విషయంలో ప్రభుత్వం అనేక మంది లబ్ధిదారులకు పెన్షన్లు తొలగించి, పెంచిన మొత్తాన్ని అందిస్తున్న పరిస్థితి ఉందని ఆయన విమర్శించారు. కొత్తగా పెన్షన్లు మంజూరు చేయించుకోవాలంటే వివిధ రకాల ధ్రువపత్రాలు సమర్పించాలని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆధార్, రేషన్ కార్డు వంటి ప్రాథమిక వివరాల ఆధారంగా అర్హులైన వారికి పెన్షన్లు అందించినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్, ఎంపీటీసీ ఆశావహులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

**బుచ్చయ్యపేట జయ జయహే**

బుచ్చయ్యపేట మండలం చిన్నయ్యపాలెం గ్రామంలో శనివారం రావికమతం ఐసిడిఎస్ పరిధిలో సిడిపిఓ మంగతాయారు ఆధ్వర్యంలో తురకలపూడి సెక్టార్లో చిన్నియ్యపాలెం గ్రామాల్లో పోషకాహారం మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ హైమావతి మాట్లాడుతూ థీమ్ 2 ప్రకారం వేడి ఆహారం భుజించాలని తెలిపారు.మన పిల్లలకు. కుటుంబాలకు వేడి అహారం పెట్టాలని ఆహారం వైద్యం పాటించాలని తెలిపారు.గర్భిణీలకు బాలింతలు పిల్లలు అహారం ఆరోగ్యం తాగుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మునగాకు ప్రాముఖ్యత గురించి వివరించి ప్రతిరోజు ఆహారంలో తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ,అంగన్వాడి టీచర్ పి. వెంకటలమ్మి, ఎన్. పద్మ కుమారి, టి. రమణమ్మ, ఎమ్ ఎల్ హెచ్ పి వెంకటలక్ష్మి, ఏ ఎన్ ఎమ్ ఎస్ కే రంజాన్, ఆశ సిహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## వడ్డాది పాత కుమ్మరి వీదిలో

# అన్నదానం

**బుచ్చయ్యపేట, జయ జయహే**

ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుంది అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు అన్నారు. వడ్డాది పాత కుమ్మరి వీధిలో హనుమాన్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా తాతయ్య బాబు వినాయకుడిని దర్శించుకుని పూజలు జరిపారు.హనుమాన్ ఫ్రెండ్స్ యూత్ సభ్యుడు వెలుగుల రాజేష్ దంపతులు తమ సొంత నిధులతో శనివారం మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.భక్తులు భారీగా తరలి వచ్చారు. హనుమాన్ యూత్ సభ్యులను,దాత రాజేష్ను,వారి కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు అభినందించారు.సాయంత్రం లడ్డూ వేలం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఆదివారం సాయంత్రం స్వామివారి నిమజ్జనోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు.

# మూడేళ్లలో 7 వేల మంది విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

### - 'కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్' ఉదారత

### - అభినందించిన వైసీపీ నేత రవిరాజు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19, జయ జయహే**





గడిచిన మూడేళ్లలో విశాఖపట్నం జిల్లాలోని గ్రామీణ, గిరిజన, నగర ప్రాంతాలకు చెందిన 7 వేల మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేసినట్లు కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శనివారం ఆరిలోవ లోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌నందు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరిలోవ జోన్ విద్యార్థులు 125 మందికి 'కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్' సహకారంతో ఉచిత స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కన్సర్న్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పి.కె. జోష్ మాట్లాడుతూ "విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిలో విమర్శనాత్మక ఆలోచనా ధోరణి, సంభాషణ నైపుణ్యాలను పెంపొందించడమే కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగానే గత మూడేళ్లుగా రూ. 35 లక్షల విలువైన 7,000 బ్యాగులను ఉమ్మడి విశాఖ పరిధిలోని విద్యార్థులకు అందించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. దీనిని ఒక లక్ష్యంగా పూర్తి చేశాం. బ్యాగులు అందుకోవడమే కాకుండా, తిరిగి సమాజానికి సేవ చేసే సామాజిక బాధ్యతను కూడా పిల్లలలో పెంపొందించేలా ప్రోత్సహిస్తున్నాం" అని పేర్కొన్నారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఫౌండర్ డాక్టర్ కె .రమాప్రభ మాట్లాడుతూ "కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ విశాఖపట్నంలో అనేక రకాల సేవా కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తోంది. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌తో పాటు విశాఖ బాలోత్సవం, పలు కళాశాలలకు ఆర్ఓ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం వంటి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను ట్రస్ట్ నిర్వహించడం అభినందనీయం" అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. కన్సర్న్ సేవలను వైఎస్సార్సీపీ ఉత్తరాంధ్ర ప్రచార కమిటీ అధ్యక్షులు జీవీ రవిరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ సౌత్ ప్రెసిడెంట్ శివకుమార్ రెడ్డి, స్థానిక సీఐటీయూ నాయకులు వి. నరేంద్ర కుమార్, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ కె. సుశీల, కోఆర్డినేటర్ పి. సతీష్, క్రియేటివ్ లెర్నింగ్ సెంటర్ల ట్యూటర్లు పైడ్రాజు, అప్పలకొండ, ఉష, వీసీసీ ఆర్గనైజర్లు చిట్టి రాణి, సన్యాసమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్య సేవలు కావలిసిన వారి కోసం "మనోబందు"






**జి. వీరపాండ్యన్,**
**విజయవాడ (జయ జయహే)**

మానసిక ఆరోగ్య సేవలు కావలిసిన వారి కోసం "మనోబందు" సేవలు అందించడం అభినందనీయం అని ఆంధ్రప్రదేశ్ పభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ జి. వీరపాండ్యన్ అన్నారు. శనివారం ఉదయం విజయవాడ లో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మనోబందు సంస్థ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికోసం కృషి చేస్తున్న మనోబందు సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సహకరిస్తుంది అని ఆయన ప్రకటించారు. మానసిక ఆనారోగ్య సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కోసం టెలి-మానస్ సేవలు అందిస్తోంది అన్నారు. మానసిక అనారోగ్యం ఉన్న వారి కోసం హెల్ప లైన్ నెంబర్ 14416 ఏర్పాటు చేసాం అని వివరించారు .మనోబందు సంస్థ వ్యవస్థాపకులు భూపతి రాజు రామకృష్ణ రాజు మాట్లాడుతూ అయిదు సంవత్సరాలుగా సంస్థ నిర్వహించిన సేవలు వివరించారు. ప్రధానంగా మానసిక అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించడం, రక్షణ కల్పించడం, మానసిక వైద్య చికిత్స అందించడం, పునరావాసం కల్పించడం , ఆరోగ్య కుదుట పడిన వారికి కుటంబంతో పునఃకలయిక, అవసరమైతే నిరంత్ర సంరక్షణ అనే సేవాకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని వివరించారు. ఈ ఏడాది 2025--26ల్లో మనోబంధు సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మున్సిపల్ అధికారులతో కలిసి 60 రోజులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి 105 మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతూ, రోడ్లు మీద జీవిస్తున్న వారిని రెస్క్యూ చేసి ప్రభుత్వ వైద్యశాలల్లో ఆరోగ్యం మెరుగు పరచడం జరిగిందన్నారు. అందులో 27 మందిని వారి కుటుంబాలకు అప్పగించడం జరిగింది. 51 మందికి భాగస్వామ్య ఆశ్రయ్ కేంద్రాలలో పునరావాసం కల్పించడం జరుగింది. మిగిలిన వారు వైద్యశాల లో వైద్యం పొందుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వై డి రామారావు, ఇండ్ల హాస్పిటల్స్ వ్యవస్థాపకులు ఇండ్ల రామ సుబ్బారెడ్డి, సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ముంబై కి చెందిన శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు,మానసిక వైద్య నిపుణుడు, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ మాజీ అధ్యక్షులు డా. పి.లోకేశ్వరరెడ్డి, గోతాల బాబా, రిటైర్డ్ బ్యాంక్ అధికారి దసరధ రామయ్య , సమాలోచన ప్రతినిధి చక్రధర్, గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మనోబందు ఫౌండేషన్ ప్రతినిధులూ, కార్యకర్తలు తరలివచ్చారు.



## మాడుగుల అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారులు

**మాడుగుల సెప్టెంబర్ 19 జయ జయహే**

మాడుగుల అన్న క్యాంటీన్‌ను మాడుగుల నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆశా దేవి మండల ప్రత్యేక అధికారి బి జగదీశ్వర్ రావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. అలాగే రికార్డులు పరిశీలించారుఅన్న క్యాంటీన్ నిర్వహణ, సేవల పట్ల అధికారులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజలకు నాణ్యమైన ఆహారం అందుబాటులో సేవలు సమర్ధవంతమైన నిర్వహణఅన్న క్యాంటీన్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు శ్రీ లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి ఆర్ నాయుడు, టోకెన్ ప్రతినిధి సిహెచ్ త్రి మూర్తి, గంగరాజు, శ్రీను, ప్రసాదు పాల్గొన్నారు



## మాడుగుల మండలంలో 77 పోలింగ్ స్టేషన్లు

**మాడుగుల, సెప్టెంబర్ 19, జయ జయహే**

రానున్న స్థానిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లో నిర్ధారణ చేశారు. మాడుగుల మండలంలో గల 29 పంచాయతీల్లో మొత్తం 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ శనివారం తుది జాబితా విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎండిఓ కే అప్పారావు పోలింగ్ స్టేషన్ల జాబితా ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.



## తాచెరు నదిలో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమం

**మాడుగుల సెప్టెంబర్ 19 జయ జయహే**

ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మాడుగుల సాగరం రహదారిలో గల తాచేరు నదిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నదిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తుప్పల నుండి డొంకలను తొలగించారు. అలాగే నది పరివాహక ప్రాంతంలో పేరుకుపోయిన తుప్పలను కూడా తొలగించి నీరు సక్రమంగా పారేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఆశా దేవి, మండల ప్రత్యేకాధికారి , పి ఆర్ ఈ ఈ బి.జగదీష్ బాబు, ఎండిఓ కే అప్పారావు, వ్యవసాయ అధికారిని అనసూయ, ఏపీఎం రమణకుమారి, పంచాయితీ అభివృద్ధి అధికారులు, ఉపాధిశ్రామికులు , సీసీలు వివోఏలు, అంగన్వాడి కార్యకర్తలు, సూపర్వైజర్లు, గ్రీన్ అంబాసిడర్లు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హరిద్ర కుంకుమ అలంకరణలో స్వయంభూ

**చోడవరం సెప్టెంబర్ 19 జయ జయహే**



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరం స్వయంభూ శ్రీ విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు లో శనివారం స్వామివారు హరిద్ర కుంకుమ అలంకరణ లో కార్యసిద్ధి గణపతిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి చందన పూజ, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చందన వర్ణం లో గల స్వామివారిని అనేకమంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే హోమం కూడా నిర్వహించారు.

# ధర్మమే శ్వాస.. సేవే సంకల్పం!

**రాజమహేంద్రవరం, వీఎల్‌పురం, సెప్టెంబర్ 19:**

సనాతన ధర్మ పరిరక్షణతో పాటు సమాజ సేవకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం విఎల్‌పురం సెంటర్‌లో వైభవంగా జరుగుతున్న వరసిద్ధి వినాయకుని 49వ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైందవ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారతీయ సనాతన సంస్కృతిలో మహిళలకు అత్యున్నత స్థానం ఉందన్నారు. ఆడపడుచులను లక్ష్మీ, సరస్వతి, పార్వతీ దేవతల ప్రతిరూపాలుగా గౌరవించే గొప్ప సంప్రదాయం మనదని పేర్కొన్నారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారత విషయంలో సమాజం మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూనే ఆధ్యాత్మికతను శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవాలని సూచించారు. మన పూర్వీకులు అందించిన విజ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో అనుసంధానించుకుంటూ



యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.తారకరామ నామస్మరణ, పంచభూతాలు, ప్రకృతితో మానవ జీవనానికి ఉన్న అనుబంధాన్ని ఆయన వివరించారు. సనాతన ధర్మంలోని విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ధర్మ పరిరక్షణతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 2022లో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేనను స్థాపించి రాజానగరం, జగ్గంపేట, పోలవరం నియోజకవర్గాల్లో విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు కంబాల శ్రీనివాసరావు వివరించారు. అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం సుమారు రూ.35 కోట్ల సొంత నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. శ్రావణ మాసంలో లక్షలాదిబ మంది మహిళలకు పట్టుచీరలు, బంగారు ఆభరణాలు అందించి వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపినట్లు పేర్కొన్నారు.విఎల్‌పురంలో సెప్టెంబర్ 14న ప్రారంభమైన వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. భారీ గణనాథుని విగ్రహం, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణల నడుమ ప్రతిరోజూ విశేష పూజలు, అభిషేకాలు, వేద మంత్రోచ్చారణలు, భజనలు నిర్వహిస్తున్నారు. తారకరామ నామస్మరణ, జై శ్రీరామ్ నినాదాలతో ఉత్సవ ప్రాంగణం మారుమోగుతోంది. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి బాబి నేతృత్వంలో యువత మిత్ర బృందం, బిజెపి శ్రేణులు, మహిళలు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తి కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 27న ఆదివారం ఉదయం 11 గంటలకు గణనాథుని మహా శోభాయాత్ర నిర్వహించనున్నారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



## ముస్లిం సమస్యలపై అహ్మద్ షరీఫ్‌కు విన్నపం

**విశాఖపట్నం జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు అహ్మద్ షరీఫ్‌ను ముస్లిం పెద్దలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. చిన్న వాల్తేరు మహమ్మదీయ మసీదుకు నమాజ్ నిమిత్తం వచ్చిన అహ్మద్ షరీఫ్‌ను మక్కా మసీదు అధ్యక్షులు షేక్ మునీర్, చిన్న వాల్తేరు మహమ్మదీయ మసీదు కార్యదర్శి, ట్రెజరర్లు ముస్తఫా, నౌషాద్, సీనియర్ న్యాయవాది ఐ.ఎం. అహ్మద్ తదితరులు కలిసి ముస్లింల సమస్యలపై కొంతసేపు చర్చించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఐ.ఎం. అహ్మద్ చిన్న వాల్తేరు మసీదు పరిధిలోని కొంత స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు సహకరించాలని అహ్మద్ షరీఫ్‌ను కోరారు. కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వస్తే పేదలు, స్థానిక ప్రజలకు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకోవడంతో పాటు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఈ అంశంపై సానుకూలంగా పరిశీలించాలని వారు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు అహ్మద్ షరీఫ్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మసీదు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.




## పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ఖైనీ, పొగాకు విక్రయాలు అరికట్టాలి

**నిడదవోలు ఎస్ఐ జగన్‌మోహన్‌రావుకు వినతిపత్రం అందజేసిన జువ్వల రాంబాబు...**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

మైనర్ బాలురు, పాఠశాల విద్యార్థులకు ఖైనీ, పొగాకు, పాన్‌పరాగ్ వంటి మత్తు కలిగించే పదార్థాలను విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈగల్ బృందం ఆధ్వర్యంలో నిడదవోలు పట్టణ ఉప పరిశీలకుడు జగన్‌మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.పాఠశాలలు, కళాశాలల సమీపంలోని కిళ్లీ దుకాణాలు, కిరాణా దుకాణాల్లో మైనర్ బాలురు, విద్యార్థులకు మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జువ్వల రాంబాబు తెలిపారు. ఇటీవల కొంతమంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లిన అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లకుండా మరుగుదొడ్ల వద్ద ఖైనీ, పొగాకు వంటి పదార్థాలను వినియోగిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.ఇలాంటి పదార్థాల వినియోగం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని, విద్యా సంస్థలను మాదక పదార్థాల నుంచి కాపాడేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ఈగల్ బృందం ఆధ్వర్యంలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డి. అనిల్‌కుమార్, డీవైఎఫ్ఐ నాయకుడు టి. నానీ తదితరులు పాల్గొన్నారు.

## మరిడిమాంబ నగర్‌లో డ్రైనేజీలు క్లీన్

**అనకాపల్లి :**



జీవీఎంసీ 112వ వార్డు పరిధిలోని విజయరామరాజుపేట, మరిడిమాంబ నగర్ ప్రాంతంలో గత కొంతకాలంగా వేధిస్తున్న మురుగునీటి నిల్వ సమస్యకు పరిష్కారం లభించింది. నిలిచిపోయిన కాలువ పూడికను తొలగించి, నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించేలా ప్రత్యేక యంత్రాల సాయంతో విస్తృతంగా క్లీనింగ్ పనులు చేపట్టారు. ఈ ప్రాంతంలో కాలువ మూసుకుపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి మురుగునీరు వెనక్కి తన్ని ఇళ్లలోకి చేరుతోందని, దీనివల్ల చిన్నారులు, స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై జనసేన పార్టీ నియోజకవర్గఇన్ ఛార్జ్ భీమరశెట్టి రాంకీ కి స్థానికుల విన్నపం పై సానుకూలంగా స్పందించిన రాంకీ....సంబంధిత అధికారులను, వార్డ్ కూటమి నాయకులను పురమాయించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ పూడికతీత మరియు క్లీనింగ్ పనులను వార్డు జనసేన పార్టీ కన్వీనర్ ఆళ్ల ఇందు రామచంద్రరావు సారధ్యంలో కూటమి నాయకులు పీలా లోకేష్, పాలురాజు తదితరులు దగ్గరుండి పర్యవేక్షించారు. మురుగు కాల్వలను క్రమం తప్పకుండా శుభ్రపరుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కి, నియోజక వర్గ ఇన్ ఛార్జ్ భీమరశెట్టి రాంకీ కి,సహాయం అందించిన వార్డు నాయకులకు మరిడిమాంబ నగర్ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి కందుల దుర్గేష్

## విజయవాడలో ఘనంగా బోయి భీమన్న జయంతి వేడుకలు





**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ముఖ్య అతిథులుగా పాల్గొని బోయి భీమన్న చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లుకు లి'బోయి భీమన్న అవార్డు--2026'లిను ప్రదానం చేసి, జ్ఞాపిక, శాలువాతో పాటు రూ.2 లక్షల నగదు పారితోషికాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోయి భీమన్న రచనలు సమాజంలో చైతన్యం, సామాజిక స్పృహను పెంపొందించాయని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న బోయి భీమన్న కళాపీఠాన్ని రాజమహేంద్రవరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అర్హులైన కళాకారులందరికీ త్వరలో గుర్తింపు కార్డులు అందిస్తామని వెల్లడించారు.కార్యక్రమంలో బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షుడు పూల త్రివిక్రమరావు, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, సాంస్కృతిక శాఖ అధికారులు, పలువురు రచయితలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



# కష్టకాలంలో భరోసా..

## బూరుగుపల్లి శేషారావు చేతుల మీదుగా రూ.34.10 లక్షల చెక్కుల పంపిణీ...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న నిడదవోలు పట్టణం, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు రూ.34.10 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు అందజేశారు. వేలివెన్ను క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.దీంతో ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో 1,338 మంది లబ్ధిదారులకు సుమారు రూ.8.32 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలిపారు.ప్రజలు అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో కష్టాల్లో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రపాలెంలో ఘనంగా లక్ష్మీ గణపతి పూజా హోమం

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 20,**

మండలంలోని రాజేంద్రపాలెం వినాయక ఆలయం వద్ద లక్ష్మీ గణపతి పూజా హోమం ఘనంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గణపతి హోమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కొయ్యూరు జడ్పీటీసీ బీజేపీకి కేటాయించాలి..

### కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చకగ్రావు

**కొయ్యూరు (జయ జయహే న్యూస్)సెప్టెంబర్ 20,**



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొయ్యూరు మండల జడ్పీటీసీ టికెట్ బీజేపీకి కేటాయించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిబోయిన చకగ్రావు (చిన్న) కోరారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండలంలో బీజేపీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, జడ్పీటీసీ టికెట్ కేటాయిస్తే గెలుపు తథ్యమన్నారు. పీఎం జన్మన్ నిధులతో మారుమూల గ్రామాలకు రహదారులు, జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీరు వంటి అభివృద్ధి పనుల వల్ల మండలంలో బీజేపీకి మంచి గుర్తింపు వచ్చిందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఏజెన్సీలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి నిధులు అందిస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తోందని తెలిపారు. కూటమి నేతలు పొత్తు ధర్మాన్ని పాటించి కొయ్యూరు మండలంలో బీజేపీకి అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఈనెల 20న కాంచన సిస్టర్స్‌చే కర్ణాటక సంగీత గాన ద్వయం

**భీమవరం ; (జయ జయహే )**



ఈనెల 20వ తేదీన కాంచన సిస్టర్స్ కాంచన రంజని, కాంచన శృతి రంజని లచే కర్ణాటక సంగీత గాన ద్వయం నిర్వహిస్తున్నట్లు అన్నపూర్ణ మెమోరియల్ మ్యూజికల్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రభట్ల శ్రీనివాస్, చంద్రభట్ల నాగ మురళీ మోహన్ ప్రసాద్ తెలిపారు. శనివారం పోస్టర్ ను విడుదల చేసి మాట్లాడారు. శ్రీఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య, అన్నపూర్ణ వె-ఎమోరియల్ మ్యూజికల్ అకాడమీ సంయుక్త అధ్వర్యంలో భీమవరం శ్రీవిద్య గణపతి ఆలయం వద్ద సాయంత్రం 6.30 గంటలకు కాంచన సిస్టర్స్ చే కర్ణాటక సంగీత గాన ద్వయం జరుగుతుందని, సప్తస్వరాల సోయగాలతో, స్వర - రాగ - తాళ సమ్మేళనంలో రాగభవల మాధుర్యాన్ని ఆలపిస్తారన్నారు. కర్ణాటక సంగీత గాన ద్వయం అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కోయ్యే మోషేన్ రాజు, రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ, ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి లు తదితర ప్రముఖులచే సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.



## చోడవరం మండలంలో పోషణ మాసోత్సవాలు

**చోడవరం సెప్టెంబర్ 19 జయ జయహే**

రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల చోడవరం సెక్టర్లో లక్కవరం, ద్వారకా నగర్ కోటవీధి అంగన్వాడి కేంద్రాల్లో శనివారం సిడిపిఓ వి. మంగతాయారు ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, కిశోర బాలికలకు పోషణ మాసం పై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించడం జరిగింది. అదే విధంగా “మన అంగన్వాడీ - మన బాధ్యత” అని ప్రతిజ్ఞ చేయించారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం ప్రతిరోజూ తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. అలాగే చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని, వారంలో రెండు రోజులు ఆకుకూరలు, అలాగే పప్పులు తీసుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతి ప్రియ, ఎస్.కె. దాలిమ్ , అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలు పాల్గొన్నారు.



## సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోండి

**మాడుగుల సెప్టెంబర్ 19 జయ జయహే**

సమస్యలు ఏమైనా ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని తగాదాలకు పట్టుదలకు పోవద్దని తహసిల్దార్ కే రమాదేవి ఎండిఓ కే అప్పారావు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంపై శనివారం వివిధ గ్రామాల కి చెందిన ఇరు వర్గాలతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలపై చర్చించారు. సమస్యను అర్థం చేసుకొని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సమస్యలపై ఇది వర్గాలతో రాజీమార్గం పై చర్చించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి బి. జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు

## డ్రోన్ సర్వేలో గంజాయి సాగు లేదని తేలింది

### కొయ్యురు ఎస్సై

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 20,**




అల్లూరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గతంలో గంజాయి సాగు జరిగిన ప్రాంతాలపై కొయ్యూరు పోలీసులు డ్రోన్ తో నిఘా ముమ్మరం చేశారు.ఇందులో భాగంగా బకులూరు, బొడ్డపుట, ఎస్.ఆర్.పాలెం గ్రామాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించారు. గతంలో గంజాయి సాగు జరిగిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించగా ప్రస్తుతం ఎక్కడా గంజాయి సాగు లేనట్లు తేలిందని ఎస్సై తెలిపారు.రైతులు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల వైపు మళ్లారని, గంజాయి సాగుపై నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.



## చెరువు పనులు పరిశీలించిన ప్రత్యేక అధికారి

**మాడుగుల సెప్టెంబరు 19 జయ జయహే**

మాడుగుల శ్రీ మోదకొండమ్మ వారి ఆలయ వద్దగల పాండవుల చెరువు ఆధునీకరణ పనులను మాడుగుల మండల ప్రత్యేక అధికారి బి జగదీష్ బాబు శనివారం పరిశీలించారు. 50 లక్షల రూపాయలతో ఈ చెరువును ఆధునికరిస్తున్నారు. ఇప్పటికే గట్టు రేవిటమెంటుతోపాటు బండ నిర్మాణం చేపట్టారు మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఈ ఆధునికరణ పనులు వివరాలను ఎండిఓ అప్పారావు ఆయనకు వివరించారు.

## చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విస్తృత తనిఖీలు

**చోడవరం సెప్టెంబర్ 19 జయ జయహే**



చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ , పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.చోడవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి. అప్పలరాజు ఆధ్వర్యంలో ఎస్సై బి. జోగారావు, ఏఎస్ఐ సిహెచ్ పెద్దయ్య అనకాపల్లి జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం నుండి వచ్చిన డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.గంజాయి,ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా గంజాయి హాట్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానాస్పద వ్యక్తులు, ప్రదేశాలు వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు వినియోగానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

For a pure tomorrow.. జయహో

# స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**తిరుపతి, సెప్టెంబర్ 19, జయ జయహే**



తిరుపతి జిల్లాలో స్వచ్ఛతా హి సేవా--2026 కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాల ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు, స్థానిక సంస్థలు సమన్వయంతో స్వచ్ఛతా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పరిశుభ్రత, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణతో పాటు ప్రజల్లో అవగాహన, ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శాశ్వతంగా పరిశుభ్రత మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్వహించిన కార్యక్రమాలను డాక్యుమెంట్ చేసి నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవా--2026ను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.




# గ్రామీణ వారసత్వంపై మోనోగ్రాఫ్ ఆవిష్కరణ

**తిరుపతి, సెప్టెంబర్ 19, జయ జయహే**

తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని చారిత్రక, సాంస్కృతిక, పురావస్తు, పర్యాటక ప్రాధాన్యత కలిగిన వారసత్వ సంపదపై రూపొందించిన 'తిరుపతి జిల్లా గ్రామీణ వారసత్వం' మోనోగ్రాఫ్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ శనివారం ఆవిష్కరించారు. జిల్లాలోని 52 ముఖ్యమైన వారసత్వ, పురావస్తు, పర్యాటక ప్రదేశాలు, కట్టడాలు, సంప్రదాయ నిర్మాణాల వివరాలను ఇందులో పొందుపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల చారిత్రక నేపథ్యం, స్థానిక ఆచారాలు, సాంస్కృతిక అంశాలు, జీవన విధానాన్ని కూడా పత్రబద్ధీకరించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ వారసత్వ సంపద పరిరక్షణ, ప్రజలకు అవగాహన కల్పించడంలో మోనోగ్రాఫ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, టూరిజం ఆర్‌డీ రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



# విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 19, జయ జయహే**

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు శనివారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్, జనసేన పార్టీ నాయకులు కొట్టే సాయి ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు.దేవస్థానం ఆధ్వర్యంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కుమార్, జయప్రకాష్, మహేష్, గరికపాటి చంద్ర, చిరంజీవి, పసుపులేటి నవీన్, పర్వతాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# వినాయక ఆలయానికి కుర్చీలు బహుకరణ

**మునగపాక, సెప్టెంబర్ 19, జయ జయహే:**

ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగస్వామ్యులు కావాలని వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్ అన్నారు. మునగపాక పల్లపు వీధిలోని వినాయక ఆలయానికి ప్రసాద్ తన సొంత నిధులు పదివేల రూపాయలుతో సమకూర్చిన కుర్చీలను శుక్రవారం రాత్రి కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, వినాయక ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని, ఆలయ కమిటీ సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి కన్నారావు, ఆడారి కాశిబాబు, వేగి సూరిబాబు, దాడి శ్రీరామ్మూర్తి, సూరిశెట్టి దుర్గ నాయుడు, దాడి సూరిబాబు, పెంటకోట జగ్గప్పారావు, సూరిశెట్టి మహాలక్ష్మి నాయుడు, వెలగా సురేష్, మళ్ల రామ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ గణపతి పాట రూపకర్త గంగపుత్ర గాంధీకి ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 19, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని బాబు అగ్రహారం వద్ద నవభారత్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ గణపతి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యువతకు చక్కటి సందేశాన్ని అందించే పాటను రూపొందించారు.శ్రీకాళహస్తి కావమ్మ గుడి వీధికి చెందిన పాటల రచయిత, కవి, యూట్యూబ్ డైరెక్టర్ గంగపుత్ర గాంధీ ఈ పాటను రచించి, చిత్రీకరించారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా, చెడుదారిలో పయనించకుండా మంచి మార్గాన్ని ఎంచుకుని తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలనే సందేశాన్ని పాట ద్వారా అందించారు.ఈ పాటను శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అభినందించారు. అదేవిధంగా ఆల్ ఇండియా రేడియో ప్రతినిధులు కూడా పాటలోని సామాజిక సందేశాన్ని అభినందించి, గంగపుత్ర గాంధీని ఇంటర్వ్యూ చేశారు.ప్రజల నుంచి వచ్చిన ఆదరణ, పాటను మరోసారి చూడాలనే కోరిక మేరకు ప్రతిరోజూ సాయంత్రం 7 గంటల నుంచి పాటను ప్రదర్శిస్తున్నారు. పాటకు గరికపాటి లిఖిత్ సాయి చక్కటి ఎడిటింగ్ అందించారు.ఈ సందర్భంగా నవభారత్ యువజన సంఘం ఆధ్వర్యంలో పాట రూపకర్త గంగపుత్ర గాంధీని ఘనంగా సన్మానించారు.విద్యార్థులు, యువతలో సానుకూల ఆలోచనలు పెంపొందిస్తూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత భవిష్యత్తు వైపు అడుగులు వేయాలనే సందేశాన్ని ఈ పాట అందించడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నవభారత్ యువజన సంఘం అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు, న్యాయవాది గుమ్మల్ల రాజేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త ఓరుగంటి నాగేశ్వరరావు, హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత మునీర్ భాష, నవభారత్ యువజన సంఘం సభ్యులు చక్రాల మహేష్, బాబా ఫరీద్, రెడ్డి జగదీష్, బాలిశెట్టి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహకార దర్శి కోకిల చందు, జనసేన నాయకులు గరికపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రతో పరిశుభ్రతకు ప్రాధాన్యం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 19, జయ జయహే**

శ్రీకాళహస్తి పరిశుభ్రమైన పరిసరాలతో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడమే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లక్ష్యమని ఎస్వీఏ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ అన్నారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల పరిసరాల్లోని చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గంగారామ్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ టి. సునీత, అధ్యాపకులు డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ కే. శ్రీదేవి, డాక్టర్ బాపనయ్య, డాక్టర్ రవి ప్రసాద్, డాక్టర్ సతీష్, ఎస్. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రతో ఆరోగ్యకర సమాజం

## ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

**ఏర్పేడు, సెప్టెంబరు 19, జయ జయహే**

ఏర్పేడు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఏర్పేడు మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ప్రతిజ్ఞ చేసి, అనంతరం మానవహారం నిర్వహించారు. గురువారెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సౌభాగ్యమ్మ, డిప్యూటీ ఎంపీడీవో రమణ, పంచాయతీ కార్యదర్శి వెంకటముని, ఏఈలు చక్రధర్, సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది, సంఘమిత్రలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.




# నిడదవోలు మున్సిపల్ చైర్మన్ పదవికి పోటాపోటీ....

## బరిలో వైసీపీ, టీడీపీ, జనసేన నేతలు.. సీటు ఎవరికి దక్కుతుందో?....

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీ ఆసక్తికరంగా మారింది. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన పలువురు ఆశావహులు చైర్మన్ పదవిపై దృష్టి సారించడంతో రాజకీయ వర్గాల్లో చర్చ జోరందుకుంది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కామిశెట్టి సత్తిబాబు, తెలుగుదేశం పార్టీ నుంచి కొమ్మిన వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నుంచి రంగా రమేష్, డాక్టర్ తోపారల కళ్యాణ్ చక్రవర్తి, భూపతి ఆదినారాయణ పేర్లు చర్చలో ఉన్నాయి.మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఆయా పార్టీల నేతలు తమ రాజకీయ బలాబలాలను సమీకరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నిడదవోలు మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందనే అంశం స్థానిక రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.పార్టీల బలం, కౌన్సిలర్ల మద్దతు, స్థానిక రాజకీయ సమీకరణాలు చైర్మన్ ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది. చివరికి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని ఎవరు అధిష్ఠిస్తారనేది ఉత్కంఠగా మారింది.

# చాగల్లులో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు..

## తెలగ సంఘం ఆధ్వర్యంలో జనసేన నాయకులు డా. తోపారాల కళ్యాణ్ చక్రవర్తికి ఘన సన్మానం...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



చాగల్లు మండలంలో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలగ సంఘం ఆధ్వర్యంలో నిడదవోలు నియోజకవర్గ జనసేన నాయకులు, డా. తోపారాల కళ్యాణ్ చక్రవర్తికి ఘన సన్మానం నిర్వహించారు.ముందుగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం డా. కళ్యాణ్ చక్రవర్తిని శాలువా, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలగ సంఘం నాయకులు, జనసేన కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పాటే అయ్యప్ప, పెన్మెత్స చందు రాజు, మద్దిపాటి ఫణీంద్ర, మన్యం సూరిబాబు, గంగుల గోపి తదితరులతో పాటు పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

# మందుల కోసం వెళ్లి వ్యక్తి అదృశ్యం

## ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**తొట్టంబేడు, సెప్టెంబర్ 19, జయ జయహే**



తొట్టంబేడు మండలం జౌండీస్‌కు మందులు తీసుకురావడానికి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన శ్రీకాళహస్తి పరిధిలో చోటుచేసుకుంది. తొట్టంబేడు మండలం కొత్త కన్నాలి గ్రామానికి చెందిన పి. మునిసేఖర్ (30) ఈ నెల 12న ఉదయం వలాజా వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వలాజా, తిరుత్తణి పరిసర ప్రాంతాలతో పాటు బంధువులు, పరిచయస్తుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు.దీంతో మునిసేఖర్ తల్లి మునెమ్మ ఈ నెల 17న శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం వివిధ కోణాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. మునిసేఖర్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి దర్యాప్తుకు సహకరించాలని పోలీసులు కోరారు. 9440900008, 9154141887ఈ ఫోన్ నెంబర్లకు పోలీసుల కు సమాచారం అందించాలని టూ టౌన్ సిఐ కోరారు,

# రాష్ట్రస్థాయి క్రీడల్లో భరత్ ప్రతిభ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 19, జయ జయహే**



శ్రీకాళహస్తి పట్టణంలోని ఎం.జి. స్ట్రీట్‌లో ఉన్న అమరావతి జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె.ఎస్. భరత్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. సెప్టెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-16 క్రీడా పోటీల్లో భరత్ పాల్గొని ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి. రాజేష్, అధ్యాపకులు, సిబ్బంది భరత్‌ను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.




# పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత

**శ్రీకాకుళం (జయ జయహే )**

విశాఖ సివో పాఠశాలలో శనివారం వనమహోత్సవ వేడుకలలో భాగంగా పచ్చని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బొడ్డేపల్లి.రవి మాట్లాడుతూ ప్రస్తుతం మనమందరం విషపూరిత వాతావరణంలోని గాలిని పీల్చుకుంటూ బ్రతుకుతున్నామని, ఫలితంగా ఆయుర్దాయాన్ని సగానికి తగ్గించుకున్నామన్న విషయం అందరికీ తెలిసినదేనన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటి కాలుష్యాన్ని తగ్గించాలని సందేశం ఇచ్చారు. పాఠశాల ప్రిన్సిపల్ వై.రామకృష్ణ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యతని, అది విద్యార్థి దశ నుండే ప్రారంభం కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ బి. రమేష్ కుమార్, ప్రైమరీ6 ఇన్చార్జ్ హిమబిందు, ఏ.ఓ.బొడ్డేపల్లి.జాన్సన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com